### విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :102 నల్గొండ | మంగళవారం 08-07-2025 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 | వెల : రూ.1/-


## వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 సీట్లు...వనమహోత్సవంలో సీఎం కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్,వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు టికెట్లపై సీఎం రేవంత్ కీలకవ్యాఖ్యలు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమల్లోకి వస్తుందన్నారు. మహిళలకు 60 సీట్లు ఇచ్చే బాధ్యత తీసుకుంటా అని రేవంత్ భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని రేవంత్ పునరుద్ఘాటించారు.రాంజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. తెలంగాణకు పచ్చని చీరను కప్పేందుకు మనందరం కృషి చేయాలి" అని సీఎం పిలుపునిచ్చారు. వ్యవసాయ వర్సిటీలో ఆయన మొక్కలు నాటారు. బొటానికల్ గార్డెన్స్‌లో రుద్రాక్ష మొక్క నాటారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం తిలకించారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 18.03 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ సందర్భంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు టికెట్లపై సీఎం రేవంత్ కీలకవ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్ రాబోతోంది%ొ% వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చేబాధ్యత నేను తీసుకుంటానని భరోసా ఇచ్చారు.అయితే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీశక్తి వందన్ అధినియమ్'బిల్లును గతంలోనే పార్లమెంటులో ఆమోదం పొందింది. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే 2029 లోక్‌సభ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల చట్టం అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లు ముమ్మాటికీ తమదేనని కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంటోంది. ప్రస్తుత లోక్‌సభలో 82 మంది మహిళలున్నారు. రిజర్వేషన్ల చట్టంతో ఈ సంఖ్య 181కి చేరే అవకాశం ఉంది. లోక్‌సభలో, శాసనసభల్లో 33 శాతం సీట్లను మహిళలకు రిజర్వ్ చేస్తారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఈ సీట్లను భర్తీ చేస్తారు. రాజ్యసభలో, రాష్ట్రాల శాసన మండలిలో ఈ రిజర్వేషన్లు వర్తించవు.

## స్వర్ణకారులపై వేధింపులు మానుకోవాలి : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, పోలీసులు స్వర్ణకారులను వేధించడం మానుకోవాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కేసులకు భయపడి స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. బంగారం వృత్తి చేసుకునే వారికి సర్కారు రుణాలు ఇవ్వాలని, కార్పొరేట్ సంస్థల తో పోటీపడేలా విశ్వకర్మల కు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో వరుసగా జరుగుతున్న స్వర్ణకారుల ఆత్మహత్యలు కలిచి వేస్తున్నాయని కవిత ఆవేదన వ్యక్తంచేశారు. విశ్వకర్మ వృత్తుల వారు యావత్ దేశానికే ఊపిరి పోస్తున్నారని, కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో ఆయా వృత్తులకు ఆదరణ తగ్గిపోయిందని అన్నారు. క్రమేణ వృత్తిపని చేస్తున్న వారికి ఉపాధి లేకుండా పోతోందని, వారి జీవనం నడవడమే ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వెలిబుచ్చారు.మన దేశంలో బంగారానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, నగలను ఎంతో పవిత్రంగా చూస్తారని, కేవలం స్వర్ణకారులే కాకుండా ఇతర కులాల వారు కూడా ఈ వృత్తిని ఉపాధిగా మార్చుకున్నారని, మహిళగా మెట్టెలు, మంగళసూత్రాలు చేయించాలంటే స్వర్ణకారుడి దగ్గరికి వెళ్తామే తప్ప పెద్దపెద్ద షాపులకు వెళ్లమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. భారతీయులు పవిత్రంగా భావించే బంగారు, వెండి ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు.దొంగ బంగారం కొన్నారని పోలీసులు స్వర్ణకారులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఆ బంగారం అమ్మిన దొంగలను మాత్రం పట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక కొందరు స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. తాను నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో స్వర్ణకారులను పోలీసులు ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకున్నానని గుర్తుచేశారు.స్వర్ణకారులను వేధింపులకు



గురిచేస్తున్న 411 చట్టానికి సవరణలు చేయాలని డిమాండ్ చేస్తున్నానని, ఏపీలోనూ 411 చట్టం కింద కేసులు పెట్టి స్వర్ణకారులను వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఎమ్మెల్సీగా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా, బీసీల కోసం ఉద్యమిస్తున్న నాయకురాలిగా ఈ చట్టం సవరణ కోసం పోరాడుతానని ఆమె హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చినట్టుగానే స్వర్ణకారులతోపాటు అన్ని చేతివృత్తిదారులను ఆదుకునే చర్యలు చేపట్టాలని సూచించారు. అప్పుడే చేతివృత్తులవారు కార్పొరేట్ సంస్థలతో ధీటుగా నిలబడగలుగుతారని కవిత అన్నారు. కొందరు పోలీసుల పేరు చెప్పి స్వర్ణకారులను వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. అలాంటి నకిలీ పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లేదా సమీపంలోని నాయకులను ఆశ్రయించాలని సూచించారు. అంతే తప్ప ఆత్మహత్యలు పరిష్కారం కాదని చెప్పారు. ఒక సోదరిగా మిమ్మల్ని కోరుతున్నానని, ఆత్మహత్యలు చేసుకోవద్దని అన్నారు.

## బీహార్ ఎన్నికల సంఘం పోస్టాఫీస్‌లా పనిచేస్తోంది : తేజస్వి యాదవ్

పాట్నా:అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటర్ల జాబితా ను సవరించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. దీనిపై బీహార్‌లో ప్రతిపక్ష మహాకూటమి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు ఓటర్ల జాబితా సవరణ దేనికని, రెండు నెలల్లో జాబితాను సవరించడం సాధ్యమా..? అని ఆర్జేడీ కీలక నేత తేజస్వి యాదవ్ ప్రశ్నిస్తున్నారు.తాము ఈ నెల 5న ఎన్నికల సంఘాన్ని కలిసి అతి తక్కువ సమయంలో ఎన్నికల జాబితాను సవరించడంతో వచ్చే సమస్యలపై సందేహాలు లేవనెత్తామని తేజస్వి యాదవ్ తెలిపారు. కానీ ఎన్నికల సంఘం నుంచి తమకు ఇంతవరకు ఎలాంటి వివరణ రాకపోవడం ఆందోళనకరమైన విషయమని అన్నారు. బీహార్ ఎన్నికల సంఘం కేవలం పోస్టాఫీస్‌లా పనిచేస్తున్నదని, తమ సందేహాలకు సమాధానం ఇచ్చే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘం దగ్గర లేదని విమర్శించారు.ఎన్నికల సంఘం ఆదివారం మూడు పరస్పర విరుద్ధమైన సూచనలు చేసిందని, దీన్నిబట్టి పోల్ బాడీ కన్ఫ్యూజన్‌లో ఉందనే విషయం స్పష్టమవుతోందని తేజస్వియాదవ్ చెప్పారు.



ఎన్నికల సంఘం చేస్తున్న పరస్పర విరుద్ధ సూచనలు, పత్రికా ప్రకటనలు తమ కూటమి పార్టీలను ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. తమ సందేహాలకు ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## పహల్గాం ఉగ్ర దాడిని ఖండించిన బ్రిక్స్..




రియో డీ జెనీరో: పహల్గాం ఉగ్ర దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రదాడులు ఎక్కడ జరిగినా ముక్త కంఠంతో ఖండిస్తున్నామని, టెర్రరిజం ఏ రూపంలో ఉన్న వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశాయి. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు బ్రెజిల్‌లోని రియో డీ జెనీరలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో 'రియో డీ జెనీరో డిక్లరేషన్'ను సభ్యదేశాలు విడుదల చేశాయి. 'ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తున్నాం. క్రాస్ బార్డర్ టెర్రరిజంతోపాటు ఉగ్రమూకలకు నిధులు అందిస్తూ, ఆశ్రయం కల్పించడాన్ని ఖండిస్తున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో కలిసికట్టుగా ముందుకు వెళ్తాం. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థల పట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని అందులో పేర్కొన్నాయి. అయితే ఈ తీర్మానంలో ఎక్కడా పాకిస్థాన్ పేరు ప్రస్థావించలేదు. మరోవైపు ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశంగా భారత్‌కు స్థానం కల్పించాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది. భద్రతా మండలిని సమకాలీన అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. భారత్, బ్రెజిల్‌కు భద్రతా మండలిలో మరింత ప్రాధాన్యం కలిగి ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు, ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు సభ్యత్వంలో మెరుగైనా ప్రాతినిధ్యం కల్పించాలని అభిప్రాయపడింది. అదేవిధంగా ప్రపంచ వాణిజ్యం లో ఏకపక్ష ఆంక్షలు, అధిక టారీఫ్‌లు, రక్షణాత్మక చర్యలపై బ్రిక్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగా మిలిటరీ ఖర్చులు పెరగడం, విభజన ధోరణి మంచిదికాదని పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో శాంతి, భద్రత బలోపేతానికి రాజకీయ, శాస్త్రీయ పరిష్కారాలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చింది.

## సంపద కొందరిదే...గడ్కరీ హాట్ కామెంట్స్ !




నాగపూర్:ఈ దేశంలో పేదరికం లేదని గత పదకొండేళ్ల కాలంలో అది గణనీయంగా తగ్గిందని ఒక వైపు ప్రభుత్వ పెద్దలు చెబుతూ ఉంటారు. దానికి గణాంకాలను నివేదికలను ముందు పెడతారు. ఏకంగా కోట్ల మంది దాకా పేదలు పేదరికం నుంచి బయటకు వచ్చారని కూడా ఈ మధ్యనే చెప్పుకొచ్చారు. అయితే కేంద్ర ప్రభుత్వంలో కీలక మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నితిన్ గడ్కరీ మాత్రం కుండ బద్దలు కొట్టారు.ఆయన ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడారు. నితిన్ గడ్కరీ మహారాష్ట్రకు చెందిన వారు అన్నది తెలిసిందే. పైగా ఆయన నాగపూర్ వాసి. అందుకేనేమో తన సొంత ప్రాంతానికి వచ్చినపుడు ఆయన ఇంకా ధాటీగా మాట్లాడుతారు అని అంటారు. ఇక నాగపూర్ లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ హాట్ కామెంట్స్ చేశారు. సంపద పెరుగుతోంది అన్నది ఎంత వాస్తవమో అది కొందరి వద్దనే ఉంటోంది అన్నది అంతే వాస్తవం అన్నారు.సంపద సృష్టి జరుగుతోందని కానీ అది సమతూల్యంగా అందరికీ పంచే విషయంలోనే సరైన పాలసీలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇక మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ ల ప్రస్తావన కూడా ఆయన తెచ్చారు. ఆ ఇద్దరూ ఆర్థిక సంస్కరణలను అమలు చేయడం వల్ల సంపద పెరిగిందని అయితే సంపద ఒకే చోట కేంద్రీకృతం అవుతూంటే ఆపే చర్యలను వారు తీసుకోలేకపోయారు అని అన్నారు.అంతే కాదు సంపద ఆ దిశగా ఆలోచనలు పాలసీలు కూడా దశాబ్దాలుగా లేకపోవడం విచారించదగిన విషయం అన్నారు. ఈ రోజున చూస్తే దేశంలో జీడీపీలో ఉత్పాదక రంగం వాటా 22 నుంచి 24 శాతంగా ఉంటే సేవా రంగం వాటా 52 నుంచి 54 శాతంగా ఉందని అదే సమయంలో వ్యవసాయ రంగం వాటా కేవలం 12 శాతంగా ఉందని గడ్కరీ గణాంకాలను వినిపించారు. గ్రామీణ ప్రాంతంలో అరవై నుంచి డెబ్బై శాతం మంది ఆధారపడి అందులో భాగస్వాములు అయ్యే వ్యవసాయ రంగం వాటా కేవలం 12 శాతం ఉంటే ఆర్థిక అసమానతలు ఉండి తీరుతయాని అన్నారు.అందుకే ఈ వ్యత్యాసాలను అధిగమించి అందరికీ సంపదలో సమాన వాటా లభించేలా విధానాలు పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని నితిన్ గడ్కరీ నొక్కి చెప్పారు. నిజానికి గడ్కరీ అన్న మాటలను చూస్తే కనుక భారత దేశంలో అత్యధిక శాతం జనాభా ఉన్న వారికి అతి తక్కువ మొత్తాలే లభిస్తున్నాయి. అదే కొందరికి మాత్రం కుబేరుల మాదిరిగా సంపద అంటా చేరుతోంది.మరి ఇలా కుప్పలా సంపద పోగు అయి ఒకే చోట తక్కువ మందికే దక్కుతూంటే దేశంలో పేదలు అంతకంతకు పెరిగిపోయి ఒకే దేశంలో రెండు దేశాలు ఏర్పాటు అవుతాయన్న ఆందోళన మేధావులు చాలా కాలం క్రితమే వ్యక్తం చేశారు. పేదల భారత ధనికుల భారంతా ఎన్నడూ పూడ్చలేని అగాధం ఏర్పాటు కాకముందే ఆర్థిక నిపుణుల నుంచి సలహాలతో పాలకులు సరైన పాలసీలు రూపొందించాల్సి ఉందని అంటున్నారు. అత్యధికంగా సంపాదించే ధనికులు కుబేరుల వద్ద ఒకటికి రెండు మార్లు పన్నులు వేసి అయినా సంపదను పేదలకు చేర్చాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

## నేను పాక్ సైన్యానికి నమ్మకమైన ఏజెంట్‌ను..

ముంబై: ముంబై 26/11 పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణా అరెస్టైన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతను ఎన్ఐఏ కస్టడీలో ఉన్నారు.ఈ సందర్భంగా తహవ్వుర్‌ను ఎన్ఐఏ అధికారులు విచారిస్తున్నారు. విచారణ సందర్భంగా అతడు ముంబై ఉగ్రదాడి వెనుక తన పాత్రను అంగీకరిం చినట్లు తెలిసింది. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా ఇండియా టుడే నివేదించింది.ఢిల్లీలోని తీహార్ జైలులో ఎన్ఐఏ కస్టడీలో ఉన్న తహవ్వుర్ విచారణలో..తాను పాకిస్థాన్ సైన్యానికి నమ్మకమైన ఏజెంట్‌ను అని చెప్పినట్లు సదరు నివేదిక వెల్లడించింది. అంతేకాదు తాను, తన స్నేహితుడైన డేవిడ్ హెడ్లీకి పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో సంబంధాలు ఉన్నట్లు కూడా అంగీకరించినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ ఉగ్ర సంస్థ ప్రధానంగా గూఢచారి నెట్‌వర్క్‌గా పనిచేస్తుందని కూడా రాణా ఎన్ఐఏకి చెప్పినట్లు సమాచారం. ముంబై పేలుళ్ల కేసులో రాణా ప్రధాన నిందితుడు. అతడు పాకిస్థాన్ సంతతికి చెందిన కెనడా పౌరుడు. ముంబై ఉగ్రదాడి కుట్రదారు డేవిడ్ కోల్‌మాన్ హెడ్లీతో తహవూర్ రాణాకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఇద్దరూ కలిసి ఉగ్రదాడికి ప్రణాళిక రచించారు. దాడి అనంతరం అమెరికాకు పారిపోయాడు. 2009లో రాణాను అక్కడి అధికారులు అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి అమెరికాలోని జైలులో శిక్ష అనుభవిస్తున్న రాణాను అగ్రరాజ్యం ఇటీవలే భారత్‌కు అప్పగించింది.



ప్రస్తుతం అతడు ఎన్ఐఏ కస్టడీ లో ఉన్నారు.కాగా భారత్‌లో అక్రమంగా చొరబడిన 10 ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తమ నరమేధం మొదలుపెట్టారు.రెండు లగ్జరీ హొటళ్లు, రైల్వేస్టేషన్, జెవిస్ సెంటర్ ఇలా నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఏకంగా 60 గంటలపాటు సాగిన నరమేధంలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు.వారిలో పలువురు భద్రతాసిబ్బంది కూడా ఉన్నారు.భద్రతా బలగాల దాడిలో 9 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.మరో ఉగ్రవాది కసబ్‌ను ప్రాణాలతో పట్టుకున్నారు.ఆ తర్వాత అతడికి ఉరిశిక్ష విధించారు.

## మహారాష్ట్ర తీరంలో అనుమానాస్పద బోటు కలకలం.. పోలీసులు హై అలర్ట్

ముంబై:మహారాష్ట్ర సముద్రతీరంలో ఓ విదేశీ బోటు కలకలం రేపుతోంది. రాయ్‌గఢ్ జిల్లాలోని రేవ్‌దండాలో గల కొర్లై తీరం సమీపంలో అనుమానాస్పద బోటును భద్రతా సిబ్బంది గుర్తించారు. దీంతో అలర్ట్ అయిన అధికారులు తీర ప్రాంతంలో భద్రతను పెంచారు.రేవ్‌దండాలోని కొర్లై తీరానికి రెండు నాటికల్ మైళ్ల దూరంలో ఈ పడవను భద్రతా సిబ్బంది గుర్తించింది. పడవకు పాకిస్థాన్ గుర్తులు ఉన్నట్లు సమాచారం. అది తీరానికి కొట్టుకొచ్చి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అనుమానాస్పద పడవ గురించి సమాచారం అందుకున్న రాయ్‌గఢ్ పోలీసులు బాంబ్ స్క్వాడ్ బృందంతో అక్కడికి చేరుకొన్నారు. నేవీ, కోస్ట్‌గార్డ్ సిబ్బంది కూడా తీరానికి చేరుకున్నట్లు రాయ్‌గఢ్ పోలీసులు తెలిపారు.ఈ అనుమానాస్పద పడవ ఘటన ముంబై ఉగ్రదాడి ఘటనను గుర్తు చేస్తుండటంతో పోలీసులు, భద్రతా సిబ్బంది హై అలర్ట్ అయ్యారు. తీర ప్రాంతంతోపాటు



రాయ్‌గఢ్ జిల్లా వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. అంతేకాదు ముందుజాగ్రత్త చర్యగా తీరంలో భారీగా పోలీసులను మోహరించారు. మరోవైపు అనుమానాస్పద పడవ నుంచి రెడ్‌లైట్ వస్తున్నట్లు గుర్తించారు.

## వాళ్ల పౌరసత్వం గల్లంతవుతుంది..



హైదరాబాద్,అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటర్ లిస్టు ను సవరించాలని నిర్ణయించడంపై ఏఐఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అసహనం వ్యక్తం చేశారు.తాను ఓటర్ జాబితా సవరణకు వ్యతిరేకంగా కాదని, కానీ ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు జాబితాను సవరించాలనుకోవడం సముచితం కాదని అన్నారు. ప్రజలకు కొంత సమయం ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. బీహార్ ఓటర్ లిస్టు సవరణపై తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి వెళ్లిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.సవరించే ఓటర్ జాబితాలో 15 నుంచి 20 శాతం మంది పేర్లు గల్లంతైనా వాళ్లు కేవలం తమ ఓటు హక్కును మాత్రమే కోల్పోరని,తమ పౌరసత్వాన్ని కూడా కోల్పోతారని అసదుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల జీవనానికి సంబంధించిన సమస్య అని అన్నారు.కేవలం రెండు నెలల వ్యవధిలో ఓటర్ జాబితాను సవరించడం ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు.

## సంపాదకీయం

మంగళవారం 08-07-2025

# అమ్మాయిలు... అధిగమించారు

బాలిక విద్య- ఆవశ్యకత'... కొన్ని దశాబ్దాల క్రితం వరకూ వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు తప్పనిసరి అంశం అది. ఇప్పుడిక బాలుర విద్య ఆవశ్యకత గురించి చర్చించాల్సి వచ్చేలా ఉంది పరిస్థితి. ఉన్నత విద్యాసంస్థల్లో చేరుతున్నవారిలో అధిక శాతం అమ్మాయిలే మరి!దాదాపు వందేళ్ల క్రితం... కమల సోహోనీ బొంబాయి యూనివర్సిటీ నుంచి బీఎస్సీ పాసైంది. తండ్రిలాగే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చేరి పరిశోధన చేయాలనుకుంది. ఉత్సాహంగా దరఖాస్తు చేసింది. ఆ సంస్థ డైరెక్టర్, నోబెల్ విజేత అయిన ప్రొఫెసర్ సీవీ రామన్ ఆ దరఖాస్తును తిరస్కరించారు. పరిశోధన చేయగల సామర్థ్యం స్త్రీలకు ఉండదన్నది ఆయన అభిప్రాయం. కమల ఊరుకోలేదు. 'నా శక్తి సామర్థ్యాలను పరీక్షించకుండానే తీర్పు ఎలా చెబుతారు' అని ప్రశ్నిస్తూ ఆయన ఆఫీసు గది ముందే సత్యాగ్రహం చేసింది. దాంతో తప్పనిసరై కొన్ని షరతులతో ఆమెకు ప్రవేశం కల్పించారు. ఏడాదిపాటు ప్రొబేషన్‌లోనే ఉండాలనీ, పురుష విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలిగించకుండా మసులుకోవాలనీ, ఆమె పరిశోధన ప్రమాణాల పట్ల సంతృప్తి చెందితేనే గుర్తింపు ఇస్తామనీ... ఇలా ఉన్నాయి ఆ షరతులు. అంతటి అవమానాన్నీ దిగమింగి పరిశోధనలో కొనసాగింది కమల. మూడేళ్లు తిరిగే సరికల్లా డిస్టింక్షన్‌తో ఎమ్మెస్సీ పట్టా పుచ్చుకుంది. ఆమె పట్టుదల, అంకితభావం చూసిన సీవీ రామన్ తన నిర్ణయాన్ని మార్చుకుని ఐఐఎస్సీలో మహిళలను స్వాగతించారు. కమల సైన్స్‌లో పీహెచ్‌డీ చేసిన తొలి భారతీయురాలు. తరవాత మరో మూడు దశాబ్దాలకు ఇష్టంగా ఇంజినీరింగ్‌లో చేరిన సుధ(మూర్తి) కూడా షరతులతోనే తరగతి గదిలో ఒంటరిగా నాలుగేళ్లు ఎన్నో అవమానాలను భరించారు. వివక్షను ప్రశ్నించి మరీ టెల్కోలో తొలి మహిళా ఇంజినీరుగా చేరారు. ఇలాంటి ఎందరో కమలలు, సుధలు తొలి విద్యార్థినులుగా ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశానికి పోరాటాలు చేశారు. తరగతి గదుల్లో ఒంటరిగా కూర్చున్నారు. అంతెందుకు... ముప్పయ్యేళ్ల క్రితం కేరళలోని కోజికోడ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించినప్పుడు తొలి బ్యాచ్‌లో 42 మంది విద్యార్థులకు ఒకే ఒక్క విద్యార్థిని ఉంది. అదే సంస్థ ఈ ఏడాది 55 శాతం యువతులను చేర్చుకుని చరిత్ర సృష్టించింది. విద్యార్థుల కన్నా విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉండటం సంస్థ చరిత్రలో ఇది నాలుగోసారి.

ఫలిస్తున్న ప్రత్యేక చర్యలు

పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తరచూ అమ్మాయిలదే పైచేయిగా ఉంటోంది. ఉత్తీర్ణతలోనూ ర్యాంకుల్లోనూ ముందువరసలో ఉంటున్న అమ్మాయిలు ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోవడంలో ఇన్నాళ్లూ వెనకే ఉన్నారని చెబుతున్నాయి గణాంకాలు. 2021-22లో మొదటిసారి 2.07 కోట్ల మంది విద్యార్థినులు (48శాతం) ఉన్నతవిద్యలో చేరి రికార్డు సృష్టించారంటూ ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకటించింది. అంతకు పదేళ్ల క్రితంతో పోలిస్తే డిగ్రీ కోర్సుల్లో 46శాతం, పీజీలో 55శాతం పెరుగుదల నమోదైంది. ఉన్నత విద్యలో చేరుతున్న విద్యార్థినుల సంఖ్య వేగంగా పెరుగుతూ వచ్చింది. అయితే అదే సమయంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థినుల సంఖ్య తగ్గడం గమనార్హం. టెక్నాలజీ కోర్సులకన్నా మెడిసిన్, నాచురల్ సైన్సెస్ వైపు అమ్మాయిలు మొగ్గుచూపుతున్నారని గణాంకాలు పేర్కొంటున్నాయి. మెడిసిన్‌లో 2014-15 నుంచీ అబ్బాయిలకన్నా అమ్మాయిల చేరికలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. ఇటీవల తెలంగాణలోని ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మొత్తం పదమూడు బంగారు పతకాల్లో 12 అమ్మాయిలే గెలుచుకున్నారు. బీఎస్సీలో ఉన్న ఎనిమిదీ వాళ్లే సాధించారు. కోర్సులు ఏవైనప్పటికీ మొత్తానికి ఉన్నత విద్యలో అమ్మాయిల హవా పెరగడం సంతోషించదగ్గ పరిణామం. స్త్రీవిద్యకు సమాజంలో పెరుగుతున్న ప్రాధాన్యంతో పాటు ప్రభుత్వ, విద్యాసంస్థల ప్రోత్సాహకాలూ అందుకు దోహదం చేస్తున్నాయి. కోజికోడ్ ఐఐఎం పుష్కరకాలంగా ప్రత్యేక చర్యలు తీసుకుంది. 'విమెన్ ఇన్ లీడర్‌షిప్' పేరుతో రకరకాల ప్రోగ్రామ్‌లను చేపట్టింది. స్ఫూర్తినిచ్చే ప్రసంగాలు, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసింది. కేవలం గణాంకాల్లో ప్రగతి చూపడం మా ఉద్దేశం కాదు, సమాజానికి అవసరమైన భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దడానికే ఈ చర్యలు... అంటోంది సంస్థ. మరికొన్ని ఐఐఎంలలోనూ ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. సంబల్‌పూర్ ఐఐఎం గతేడాది ఏకంగా 76శాతం విద్యార్థినులను చేర్చుకుంది. విశాఖపట్నంలోనూ ఈసారి 51శాతం అమ్మాయిలు ఉన్నారు. అయితే అహ్మదాబాద్, బెంగళూరులాంటి పాత ఐఐఎంలు ఈ విషయంలో వెనకబడే ఉన్నాయి.

ప్రపంచవ్యాప్త ట్రెండ్

అంతర్జాతీయంగా కూడా ఉన్నత విద్యాసంస్థల్లో అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. 2023లో టూలేన్ యూనివర్సిటీలో 64శాతం మహిళలు ఉన్నారని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. యూనివర్సిటీ ఆఫ్ అరిజోనా-ఫీనిక్స్‌లో అయితే 68 శాతం విద్యార్థినులే. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థినుల శాతాలే ఎక్కువగా ఉంటున్నాయి. ఆక్స్‌ఫర్డ్‌లో 51శాతం, హార్వర్డ్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బెర్కెలీ, కార్నెల్‌లు 52, యేల్ 53, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, జాన్ హాప్కిన్స్‌లు 55, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా లాస్ ఏంజెలిస్ 56, లిబర్టీ యూనివర్సిటీ 59శాతం అమ్మాయిలతో కళకళలాడుతున్నాయి. అమెరికాలో 1982లో మొట్టమొదటిసారి అబ్బాయిలకన్నా అమ్మాయిలు ఎక్కువ మంది డిగ్రీ పట్టా పొందారు. అప్పటినుంచి ఈ ట్రెండ్ కొనసాగుతూ వచ్చింది. సమానత్వ సాధనకు ఆరోగ్యం, విద్య, ఆర్థిక భాగస్వామ్యం, రాజకీయాలు అనే నాలుగు పారామీటర్లను కొలుస్తారు. ఈ పరిణామాల ఫలితంగా ఆరోగ్యం తరవాత విద్యా రంగం కూడా అంతరాలను అధిగమించడంలో 95 శాతాన్ని దాటింది. ఉన్నత విద్యాసంస్థల్లో చేరడం, మంచి మార్కులతో పట్టాలు పుచ్చుకోవడం వరకూ బాగానే ఉంది కానీ ఆ తరవాతే వస్తోంది అసలు ప్రశ్న. ఆర్థిక భాగస్వామ్యంలోనూ అంతరాలను ఛేదించాలంటే చదువుకున్నవారంతా ఉద్యోగ వ్యాపారాల్లోకి రావాలి. కానీ పెళ్లి, కుటుంబం వారినలా రానివ్వడం లేదు. భర్త కెరీర్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తూ, పిల్లల బాధ్యత తల్లికి మాత్రమే అంటగట్టే సమాజ ధోరణిలో మార్పు రావాలి. అన్నిరంగాల్లోనూ మహిళలు పనిచేసేందుకు వీలుగా సపోర్ట్ సిస్టమ్ ఏర్పాటులో ప్రభుత్వాలు చొరవ చూపాలి. అప్పుడే సమానత్వ స్వప్నం చేరువవుతుంది!

# కమలం దక్షిణాది జపం?



న్యూఢిల్లీ,ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, దగ్గుబాటి పురంధరేశ్వరి, వనతీ శ్రీనివాసన్.. ఈ ముగ్గురికీ కీలక పదవులు దక్కనున్నట్టు సమాచారం. నిర్మలా సీతారామన్ ఆల్రెడీ ఆర్థిక మంత్రిగా సుప్రసిద్ధం. ఆమెను జాతీయ అధ్యక్షురాలిని చేస్తే.. అత్యంత కీలకమైన ఆర్థిక శాఖ నిర్వహణ ఎవరికి అప్పగించాలన్నదొక చర్చ? ఎందుకంటే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తరువాత అత్యంత కీలకమైన శాఖ ఆర్థిక శాఖే. అంతే కాకుండా మోడీ పాలసీలో ఫైనాన్స్ మినిస్ట్రీ అత్యంత ప్రధానమైన.. మోస్ట్ ఇంపార్టెంట్ శాఖ. ఇక్కడ పీకలోతు పని ఉంటుంది. అందులోంచి ఆమె ఇటు పార్టీ అధ్యక్ష పదవిని మోయాల్సి రావడం అంటే అది సాధ్యమేనా? అన్న ఆలోచనలో పార్టీ హైకమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వేళ పార్టీ పగ్గాలు నిర్మలా సీతారామన్ కు అప్పగిస్తే.. రాష్ట్రపతిగా ఒక మహిళకు పట్టం గట్టడమే కాకుండా పార్టీ పగ్గాలు మరో మహిళకు అప్పగించిన ఘనత బీజేపీకి దక్కుతుంది. అందు కోసం ఆర్థిక శాఖను మరొకరికి ఇచ్చి నిర్మలా సీతారామన్ కు పార్టీ పగ్గాలు అప్పగించే యోచన హైకమాండ్ చేస్తోందని పార్టీ వర్గాలు అంటున్నాయి. మోడీ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా పని చేస్తూ అధ్యక్షులు ఉన్నవారు ఎవరు అంటే.. అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా ఉన్నారు. వారు ఇటు మంత్రి పదవి నిర్వహిస్తూనే అటు అధ్యక్ష బాధ్యతలూ చేపట్టారు. ప్రస్తుత అధ్యక్షుడు నడ్డా కేంద్ర ఆరోగ్య మరియు రసాయన శాఖా మంత్రిగా వ్యవహరిస్తున్నారు. కాబట్టి నిర్మలా సీతారామన్ అధ్యక్షురాలైతే ఆమె జోడు గుర్రాల సవారీ చేయాల్సి ఉంటుంది.ఇక దగ్గుబాటి పురందేశ్వరిని జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలిని చేయాలన్న ఆలోచనతో అధిష్టానం ఉందంటున్నారు. ఇప్పటికే ఆమె ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా చేయడంలో కీలక భూమిక పోషించారు. దీంతో కేంద్ర అధిష్టానం ముందు ఆమె ర్యాంకింగ్ బాగా పెరిగినట్టు తెలుస్తోంది. ఇచ్చిన టాస్క్ ఇచ్చినట్టు నెరవేర్చడంలో మోడీ షాల దగ్గర పురందేశ్వరికి గుడ్ మెరిట్సే ఉన్నాయి. కాబట్టి ఆమెకు పార్టీలో కీలక పదవి లభించే అవకాశముంది.ఇక వనతీ శ్రీనివాసన్ ఎవరని చూస్తే అంత డీఎంకే హవాలోనూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కోయంబత్తూర్ సౌత్ లో అది కూడా ఒక పార్టీ అధ్యక్షుడైన కమల్ హాసన్ పై గెలిచారామె. ప్రస్తుతం తమిళ శాసన సభలో ఉన్న ఏకైక బీజేపీ మహిళా నేత. ఒక రకంగా చెబితే ముగ్గురూ ముగ్గురే. ఇప్పటికే నిర్మలా సీతారామన్ జీఎస్టీ ద్వారా దేశ ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచిన ఆర్థిక మంత్రిగా ఇటు పార్టీలో అటు ప్రభుత్వంలో బలమైన పొజిషన్లోనే ఉన్నారు. ఇటీవల పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తో ఆమె భేటీ అయ్యారు.బేసిగ్గా జేపీ నడ్డా అధ్యక్ష పదవీ కాలం 2023 జనవరితోనే ముగిసింది. అయితే 2024 లో ఎన్నికల కారణంగా జూన్ వరకూ పొడిగించారు. అప్పటికీ ఏడాది గడచిపోయింది. ఇప్పుడు పార్టీకి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడం అనివార్యం. సరిగ్గా ఇక్కడే పార్టీ పగ్గాలను మహిళా నేతకు అప్పగించాలని బీజేపీ హైకమాండ్ భావిస్తోంది. అది కూడా దక్షిణాది మహిళకు అప్పగించాలని అనుకుంటోంది. ఎందుకంటే ఇటు చూస్తే ఉత్తరాదిలో బీజేపీ సీట్లు బాగా తగ్గడం ప్రారంభించాయి. గత ఎన్నికల్లో చావు దప్పి కన్నులొట్టబోయిన పరిస్థితి. ఈ క్రమంలో దక్షిణాది నుంచి గట్టి మద్దతు అవసరం ఉందని బీజేపీకి ఉంది. అప్పటికీ దక్షిణాదిని కవర్ చేయడానికి ఎన్నెన్నో ప్రయోగాలు ప్రయత్నాలు అవార్డులు- రివార్డులు- రాజ్య సభ్యత్వాలు ఇచ్చి చూస్తున్న బీజేపీకి తగిన గురి కుదడం లేదు. దక్షిణాదిలో కేంద్ర మంత్రి పదవులు పొందిన వారెవరని చూస్తే తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపీలు కిషన్, బండి సంజయ్. ఇక కేరళ నుంచి సురేష్ గోపీ మాత్రమే బీజేపీ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.ఇక్కడ కావల్సింది ఒక సౌత్ ఐకానిక్ ఫేస్. ఒక పక్క సనాతన వారధిగా సారధిగా పవన్ కళ్యాణ్ ని ఎంకరేజ్ చేస్తూ సైడ్ వర్క్ ప్రారంభించింది బీజేపీ అధినాయకత్వం. అయితే సౌత్ కి ఒక బలమైన బీజేపీ ముఖచిత్రం లేదు. గతంలో ఎలా చూసినా కూడా కనిపించిన ఒకే ఒక్క ఫేస్. యడ్యూరప్ప. ఆయన ఎరా ముగియటంతో.. ఇప్పుడు కొత్త ముఖచిత్రం అందునా మహిళ అయితే బాగుండునని చూస్తున్నారు.అలాగని నిర్మలా సీతారామన్ ని అధ్యక్షురాలిగా చేయడం వల్ల కేవలం మహిళా కేటగిరికి మాత్రమే సరిపోతుంది. బేసిగ్గా బీజేపీని గెలిపించిన మహిళా ఓటర్లు అధికశాతం గల రాష్ట్రాలేవని చూస్తే అవి మహారాష్ట్ర, హరియాణా, ఢిల్లీ. అలా చూసినా కూడా సౌత్ లో ఏ స్టేట్ కూడా ఈ కేటగిరీ కిందకు రాదు. దానికి తోడు నిర్మల ప్రత్యక్ష రాజకీయాల పరిధిలోకి రాని లేడీ లీడర్. ఆమె ప్రస్తుతం కర్ణాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో చెన్నై లోని ఒక నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున బరిలోకి దిగుదామనుకున్నారు కానీ, ఎందుకో అది వర్కట్ కాలేదు. దానికి తోడు స్వయంగా ఆమె.. ప్రత్యక్ష రాజకీయాల్లో నిలబడి ఖర్చు చేసేంత స్థోమత తనకు లేదని తెగేసి చెప్పారు. సరిగ్గా అదే సమయంలో దక్షిణాదిలో గెలవాలంటే కులం గానీ, మతం గానీ ఎక్కువ చూస్తారని తెగేసి చెప్పిన స్వభావం గలవారామె. ఈ క్రమంలో నిర్మల కేవలం ఒక ముఖచిత్రంగా మాత్రమే ఉంటారు తప్పించి.. ప్రత్యక్ష రాజకీయాలను ప్రభావం చేసే పరిస్థితి పెద్దగా కనిపించడం లేదు.ఇక పురందేశ్వరి, వనతీ శ్రీనివాసన్ ఈ ఇద్దరూ ప్రత్యక్ష రాజకీయాల్లో అనుభవజ్ఞులుగానే చెప్పాలి. పురందేశ్వరి ప్రస్తుతం బీజేపీ నుంచి రాజమండ్రి ఎంపీగా గెలిచారు కూడా. ఈ లెక్కన పురందేశ్వరికి మంచి ఛాన్సులు ఉన్నాయి. ఇటు ఎన్టీఆర్ తనయగా మాత్రమే కాదు అటు బహుభాషా కోవిదురాలిగానూ పేరు. గతంలో కేంద్ర మంత్రిగా పని చేసిన అనుభవం ఉండటం వల్ల.. ఆమెకు నేషనల్ లెవల్ ఎక్స్ పోజర్ కూడా ఉంది. అంతేనా ఇటీవలి కాలంలో ఆమె ఆపరేషన్ సిందూర్ ఇంటర్నేషనల్ టూర్ లో ఒసభ్యురాలు కూడా. అంటే అంతర్జాతీయంగానూ ఆమె తన సత్తా చాటారు. కాబట్టి.. అధ్యక్ష పదవికి ఈమె సరిగ్గా సరిపోతారు. కానీ అధిష్టానం ఆలోచన ఎలా ఉందో తెలీదు. ప్రస్తుతానికైతే పురందేశ్వరికి బీజేపీ మహిళా మోర్చా పదవి అయితే ఇచ్చేలా తెలుస్తోంది. వనతీ శ్రీనివాసన్ ఇప్పుడిప్పుడే ప్రత్యక్ష రాజకీయాల్లో రాణిస్తున్నారు కాబట్టి ఎంతైనా ఆమె జూనియర్ కిందే లెక్క. పార్టీ పదవులు ఎన్ని చేసినా.. వాటిని నేషనల్ ఎలెక్షనీరింగ్ స్థాయికి కి విస్తరించాలంటే అందుకు తగిన అనుభవం కూడా అవసరం. కాబట్టి ఈ ముగ్గురిలో బెస్ట్ సౌత్ ఫిమేల్ ఫ్యాక్టర్ ఆప్షన్ గా ఎవరిని ఎంపిక చేస్తారో తేలాల్సి ఉంది.

# కెమికల్స్ దిగ్గజంగా భారత్!!



న్యూఢిల్లీ: దేశీయంగా ప్రపంచ స్థాయి కెమికల్ హబ్స్‌ను నెలకొల్పడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని నీతి ఆయోగ్ ఒక నివేదికలో సూచించింది. అలాగే అత్యధిక సామర్థ్యాలుండే ఎనిమిది పోర్ట్%-%ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని పేర్కొంది. అప్పుడే గ్లోబల్ కెమికల్ తయారీ దిగ్గజంగా భారత్ ఎదగగలదని పేర్కొంది. "రసాయనాల పరిశ్రమ: అంతర్జాతీయ వేల్యూ చెయిన్‌లో (జీవీసీ) భారత భాగస్వామ్యానికి దన్ను" పేరిట రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వివరించింది. 2040 నాటికి భారత్ 1 లక్ష కోట్ల డాలర్ల రసాయనాల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నీతి ఆయోగ్ తెలిపింది.

నివేదిక ప్రకారం.. 2023లో జీవీసీలో 3.5 శాతంగా ఉన్న భారత్ వాటా 2040 నాటికి 5%-%6 శాతానికి పెరగనుందని, 2030 నాటికి అదనంగా 7 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని వివరించింది. గ్లోబల్ కెమికల్ వేల్యూ చెయిన్‌లో భారత్ వాటా 3.5 శాతమే ఉండటం, 2023లో రసాయనాల వాణిజ్య లోటు 31 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండటమనేది ముడి సరుకు, ఇతరత్రా స్పెషాలిటీ రసాయనాల కోసం ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తున్న విషయాన్ని తెలియజేస్తోందని రిపోర్ట్ పేర్కొంది.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- సమగ్ర ఆర్థిక, ఆర్థికేతర సంస్కరణలు అమలు చేస్తే భారత రసాయనాల పరిశ్రమ 2040 నాటికి 1 లక్ష కోట్ల డాలర్ల స్థాయికి చేరేందుకు, జీవీసీలో వాటాను 12 శాతానికి పెంచుకునేందుకు దోహదపడుతుంది. తద్వారా శక్తివంతమైన గ్లోబల్ కెమికల్ కేంద్రంగా భారత్ ఎదగవచ్చు.
- కేంద్ర స్థాయిలో ఒక సాధికారిక కమిటీని వేయాలి. ఉమ్మడిగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, వీజీఎఫ్ మొదలైన వాటి కోసం బడ్జెట్ కేటాయింపులతో సాధికారిక కమిటీ కింద కెమికల్ ఫండ్ ఏర్పాటు చేయాలి. హబ్ స్థాయిలోని అడ్మినిస్ట్రేటివ్ యంత్రాంగం, మొత్తం హబ్ నిర్వహణను పర్యవేక్షించాలి.
- పోర్టుల్లో రసాయనాల ట్రేడింగ్‌కు సవాలుగా ఉంటున్న మౌలిక సదుపాయాల అంతరాలను పరిష్కరించడంలో పోర్టులకు తగు సూచనలివ్వగలిగేలా కెమికల్ కమిటీ కూర్పు ఉండాలి. అత్యధిక సామర్థ్యాలున్న 8 పోర్ట్ క్లస్టర్స్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.
- దిగుమతులు, ఎగుమతి సామర్థ్యాలు, సోర్సింగ్ కోసం ఒకే దేశంపై ఆధారపడటం, మార్కెట్ ప్రాధాన్యత తదితర అంశాల ఆధారంగా అదనంగా రసాయనాలను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలివ్వాలి.
- పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా పర్యావరణ అనుమతుల (ఈసీ) ప్రక్రియను వేగవంతం చేయాలి. కాల పరిమితులు, నిబంధనల అమలును పర్యవేక్షించేలా పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యం ప్రోత్సాహక విభాగం డీపీఐఐటీ కింద ఆడిట్ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా ఈసీ క్లియరెన్స్ ప్రక్రియలను సరళతరం, వేగవంతం చేయాలి. తరచుగా నివేదికలను ప్రచురించాలి. ఈఏసీకి మరింత స్వయం ప్రతిపత్తినివ్వాలి.
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో (ఎఫ్‌టీఏ) రసాయనాల పరిశ్రమ కోసం నిర్దిష్ట నిబంధనలను చేర్చేలా భారత్ చర్చలు జరపవచ్చు. పరిశ్రమ ప్రయోజనాలను పరిరక్షించేలా టారిఫ్ కోటాలు లేదా కీలకమైన ముడిసరుకు, పెట్రోకెమికల్ ఫీడ్‌స్టాక్‌లపై సుంకాలపరంగా మినహాయింపులులాంటివి చేర్చే అవకాశాలను పరిశీలించవచ్చు.
- అంతర్జాతీయంగా పోటీపడటంలో భారత రసాయన రంగం పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఫీడ్‌స్టాక్ కోసం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడటం పెద్ద సవాలుగా ఉంటోంది. ఫలితంగా 2023లో 31 బిలియన్ డాలర్ల మేర వాణిజ్య లోటు నమోదైంది.
- అంతర్జాతీయంగా పోటీ సంస్థలతో పోల్చి చూసినప్పుడు మౌలిక సదుపాయాల్లో అంతరాలు, కాలం చెల్లిన పారిశ్రామిక క్లస్టర్లు, భారీ స్థాయి లాజిస్టిక్స్ వ్యయాలు మొదలైనవి దేశీ సంస్థలకు ప్రతికూలంగా ఉంటున్నాయి.
- దీనికి తోడు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై భారత్ పెట్టే పెట్టుబడులు కూడా చాలా తక్కువగా ఉంటున్నాయి. అంతర్జాతీయంగా ఇది సగటున 2.3 శాతంగా ఉండగా, భారత్‌లో 0.7 శాతంగానే ఉంది. అత్యంత విలువైన రసాయనాలను దేశీయంగా ఆవిష్కరించడానికి ఇది ఆటంకంగా ఉంటోంది.
- నియంత్రణ సంస్థలపరమైన జాప్యాలు, ముఖ్యంగా పర్యావరణ అనుమతులపరంగా నెలకొన్న సవాళ్లు, పరిస్థితులకు తగ్గట్లు పరిశ్రమ ఎదగడంలో అవరోధాలుగా ఉంటున్నాయి.
- పరిశ్రమలో నైపుణ్యాలున్న ప్రొఫెషనల్స్ కొరత 30 శాతం మేర ఉంది. ముఖ్యంగా గ్రీన్ కెమిస్ట్రీ, నానోటెక్నాలజీ, ప్రాసెస్ సేఫ్టీ లాంటి కొత్త విభాగాల్లో ఇది మరింత తీవ్రంగా ఉంది.
- ప్రస్తుత సవాళ్లను పరిష్కరించి, ప్రతిపాదిత సంస్కరణలను అమలు చేస్తే, భారత్ అంతర్జాతీయంగా పోటీ పడే సామర్థ్యాలను పెంచుకోవచ్చు. పెట్టుబడులను ఆకర్షించవచ్చు. గ్లోబల్ వేల్యూ చెయిన్‌కి సారథ్యం వహించేలా రసాయనాల రంగాన్ని పటిష్టంగా తీర్చిదిద్దుకోవచ్చు.

## మున్సిపల్ అధికారుల తీరుపై కేంద్రమంత్రి ఆగ్రహం

హైదరాబాద్,కాలనీల్లో మురుగునీరు ప్రవహిస్తున్నా చర్యలు తీసుకోరా అంటూ.. మున్సిపల్ అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంటిముందు ఇలా ఉంటే ఎలా ఉంటుందో ఊహించారా అని అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని శ్రీకృష్ణనగర్ బస్తీలో శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ- హాల్ సీ బ్లాక్‌లో ఇళ్ల ముందు పెద్ద ఎత్తున మురుగునీరు పారుతుండటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు కిషన్‌రెడ్డి ఎదుట వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. 'మీ ఇంటి ముందు ఇలా మురుగు ఉంటే ఒక్క నిమిషమైనా ఉ

# బైపోల్ కు సిద్ధమవుతున్న ఎమ్మెల్యే?

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు హీట్ ఎక్కనున్నాయి. రాష్ట్రంలో మరో కొత్త పార్టీ ప్రవేశించేలా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు పార్టీలు మధ్య తీవ్ర పోటీ ఉంది. అధికార కాంగ్రెస్ తోపాటు ప్రతిపక్షం బీఆర్ఎస్, బీజేపీ నువ్వా నేనా అన్నట్లు రాజకీయంగా కొట్లాడుతున్నాయి. ఇక వామపక్షాలు, టీడీపీ, బీఎస్పీ వంటి కొన్ని పార్టీలు మనగడ కోసం యుద్ధం చేస్తున్నాయి. ప్రస్తుతానికి తెలంగాణ రాజకీయాల్లో వీటి ప్రభావం పెద్దగా కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో తాజాగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతోపాటు బీజేపీకి టాటా చెప్పేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కొత్త పార్టీ ద్వారా పోరాటానికి సిద్ధమవుతున్నవారు.మహారాష్ట్ర మూలాలు ఉన్న రాజాసింగ్ హైదరాబాద్ లో స్థిరపడిన విషయం తెలిసిందే. టీడీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన రాజాసింగ్ ముందుగా కార్పొరేటర్ గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత గోషామహల్ నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి 2014లో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజాసింగ్ పలు వివాదాలకు కేంద్ర బిందువుగా మారారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు ఓ మతంపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని ఆయనను బీజేపీ సస్పెండ్ చేసింది. అయితే ఎన్నికల సమయంలో ఆ సస్పెన్షన్ ఎత్తివేసి మూడోసారి ఎమ్మెల్యేగా పోటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.2023 ఎన్నికల్లో మూడోసారి గెలిచిన రాజాసింగ్ ఇటీవలకాలంలో పార్టీపై తీవ్ర వ్యతిరేకత పెంచుకున్నారని చెబుతున్నారు. ప్రధానంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ గా చేసుకుని ఆయన గతంలో చేసిన విమర్శలు చర్చనీయాంశమయ్యాయని అంటున్నారు. మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కు మద్దతుదారు అయిన రాజాసింగ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశించారు. అయితే ఆయన వివాదాస్పద వైఖరి మూలంగా పార్టీ పెద్దలు రాజాసింగ్ పేరును కనీసం పరిగణించలేదు. ఇదే సమయంలో పార్టీ పెద్దల ఆశీస్సులు లేకపోయినా రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ చేయాలని రాజాసింగ్ భావించారు. అయితే ఆయనకు కనీస మద్దతు దక్కకపోవడంతో పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తూ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.అదే సమయంలో బీజేపీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ అధిష్టానాన్ని ధిక్కరించి రాజాసింగ్ చేసిన విమర్శలపై కమలం పెద్దలు సీరియస్గా ఉన్నట్లు సమాచారం. పార్టీకి రాజీనామా చేసినందున ఆయనపై అనర్హత వేటు వేయించాలని రాష్ట్ర పార్టీకి సూచించినట్లు చెబుతున్నారు. రాజాసింగ్ పై అనర్హత వేటుకు బీజేపీ లేఖ రాస్తే.. స్పీకర్ నిర్ణయమే ఫైనల్ అంటున్నారు. రాజాసింగ్ కూడా తన రాజీనామా ఆమోదించుకోవాలని చూస్తున్నారని చెబుతున్నారు. రాజీనామా ఆమోదిస్తే ఉప ఎన్నిక వస్తుందని, ఆ ఎన్నికల్లో గెలిచి తన సత్తా ఏంటో కమలం పెద్దలకు తెలియజేయాలని చూస్తున్నారని అంటున్నారు.అయితే హిందుత్వ వాదిగా ముద్రపడిన రాజాసింగ్ ను ఏ పార్టీ అక్కున చేర్చుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ రాజాసింగ్ ను చేర్చుకోవడానికి సిద్ధంగా లేవంటున్నారు. ఇదే సమయంలో ఆయన పాత పార్టీ టీడీపీ కూడా ప్రస్తుతం రాజాసింగ్ పై ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. దీంతో తెలంగాణలో శివసేన ద్వారా పోటీ చేయాలని రాజాసింగ్ ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. అయితే ప్రస్తుతం శివసేన కూడా రెండుగా విడిపోయింది. మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఆధ్వర్యంలో ఓ పార్టీ, ఉపముఖ్యమంత్రి ఏక్ నాథ్ శిండే ఆధ్వర్యంలో మరో శివసేన ఉన్నాయి. ఇందులో ఉద్ధవ్ శివసేన ద్వారా రాజాసింగ్ పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నారని అంటున్నారు. త్వరలో శివసేన (యూబీటీ)లో చేరి గోషామహల్ లో ఆ పార్టీ కార్యకలాపాలు ప్రారంభించాలని రాజాసింగ్ చూస్తున్నారని అంటున్నారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో మరోపార్టీ ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు.

# బీజేపీ నెత్తిన పాలు పోస్తారా ?

పాట్నా:బీహార్ లో మరి కొద్ది నెలలలో అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మళ్ళీ గెలవాలని అక్కడ బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి భావిస్తోంది. ఈసారి గెలుపు బీజేపీకి చాలా ముఖ్యం. బీహార్ లో అధిక సంఖ్యలో ఎంపీ సీట్లు ఉన్నాయి. అలాగే ఉత్తరాదిన బీహార్ చాలా కీలకమైన రాష్ట్రం. అక్కడ కనుక ప్రతిపక్షం పాగా వేస్తే 2029 లోక్ సభ ఎన్నికల నాటికి వారి రాజకీయ విస్తరణకు బాటలు పడతాయని బీజేపీ ఆలోచిస్తోంది.అందుకే ఎట్టి పరిస్థితుల్లో అవకాశమే ఇవ్వకూడదని పట్టుదలతో పనిచేస్తోంది. బీజేపీ జేడీయూ ఘట బంధన్ బీహార్ లో బలంగా ఉందని నమ్ముతోంది. మరో వైపు చూస్తే జన సూరజ్ పార్టీతో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే బరిలో ఉంటున్నారు. ఆయన పార్టీ పోటీ వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతుందని కూడా లెక్క వేసుకుంటోంది.అయితే ప్రతీ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేస్తోంది. ఆ విధంగా ఆ పార్టీ ఇండియా కూటమి ఓట్లను లాగేసుకుంటోంది. దాంతో కూటమికి అది ఇబ్బందిగా మారి ఎన్డీయే భారీగా రాజకీయ లాభం పొందుతోంది.బీహార్ లో చూస్తే ఎక్కువ ముస్లిం డామినేషన్ అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. మరి ఈసారి కూడా మజ్లిస్ సొంతంగా పోటీకి దిగుతుందా అంటే అలా కాదు అని ఆ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెబుతున్నారు.బీజేపీని ఓడించడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన చెబుతున్నారు. అందువల్ల తాము కూటమితో పొత్తులకు వెళ్తామని అంటున్నారు. తమకు బలం ఉన్న సీట్లను ఇండియా కూటమి ఇస్తే కనుక కలసి పోటీ చేసి బీహార్ లో ఎన్ డీయే ప్రభుత్వం రానీయకుండా చేస్తామని శపథమే చేస్తున్నారు. మహారాష్ట్రతో పాటు చాలా చోట్ల మజ్లిస్ ఒంటరి పోరు బీజేపీకి కలసి వచ్చింది. ఈసారి మాత్రం అసదుద్దీన్ కొత్త వ్యూహం అనుసరిస్తామని చెప్పడంతో బీహార్ లో బీజేపీకి ఇబ్బందే అని అంతా అనుకుంటున్నారు.అయితే అదే సమయంలో ఆప్ బీజేపీకి అనుకోని వరాన్ని ఇస్తున్నట్లుగా పరిస్థితి కనిపిస్తోంది. బీహార్ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని ఆప్ అధినేత కేజ్రీవాల్ తాజాగా ప్రకటించారు. బీహార్ లో కాంగ్రెస్ తో కానీ ఇండియా కూటమితో కానీ తమకు ఎటువంటి పొత్తులు ఉండవని ఆయన తెగేసి చెబుతున్నారు.దాంతో బీజేపీ నెత్తిన పాలు పోయడానికేనా ఆప్ అధినేత ఈ విధంగా నిర్ణయం తీసుకున్నారు అన్నది చర్చకు వస్తోంది. నిజానికి ఆప్ చాలా కాలం నుంచే ఒంటరిగా పోటీ చేస్తోంది. ఆ పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో కూడా పొత్తులు లేకుండా పోటీకి దిగి కోరి ఓటమిని తెచ్చుకుంది. అయినా సరే తమది అదే రూట్ అంటోంది. గుజరాత్ లో కూడా తాము ఒంటరిగా పోటీ చేస్తామని చెబుతోంది.ఆప్ కి కోపం ఏమిటి అంటే ఢిల్లీలో ఒంటరిగా పోటీ చేసి కాంగ్రెస్ తమ విజయావకాశాలను దెబ్బ తీసింది అని. అందుకే కాంగ్రెస్ శిబిరంలో తాము చేరేది లేదని చెబుతోంది. ఈ విధంగా ఆప్ తీసుకున్న నిర్ణయంతో బీహార్ లో రాజకీయ పరిణామాలు మారుతాయా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఒక వైపు పీకే మరో వైపు ఆప్ ఇలా రెండు పార్టీలు వీలైనంత దాకా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీలిస్తే కనుక మరోసారి బీహార్ లో అధికారం తమకు దక్కుతుందని బీజేపీ లెక్క వేస్తోంది.మరో వైపు మజ్లీస్ తో ఇండియా కూటమి పొత్తు కూడా అంత సులువు కాదని భావిస్తోంది. ఆ పార్టీ అడిగే సీట్లను కనుక కేటాయించకపోతే ఒంటరి పోరుకే మజ్లిస్ కూడా దిగుతుందని భావిస్తోంది. ఇలా విపక్షంలో చీలికలు బలహీనతలే బీహార్ కుర్చీని పదిలంగా తమకు అప్పగిస్తాయని బీజేపీ భావిస్తోందిట. బీజేపీయేతర రాజకీయ పార్టీలలో ఐక్యత ఇపుడు అంతటా కనిపించడం లేదు. కాంగ్రెస్ అందరినీ కలుపుకుని పోయే విషయంలో భేషజాలకు పోతోంది. అది కూడా బీజేపీకి అంది వచ్చిన అవకాశంగా మారుతోంది అని అంటున్నారు.

# వారసత్వ ఆస్తి కేసులో సైఫ్‌కు చుక్కెదురు

భోపాల్,దివంగత క్రికెటర్ పటౌడీ కుమారుడు బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. మధ్యప్రదేశ్‌లోని తన పూర్వీకుల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా పేర్కొనాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సైఫ్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఈ ఆస్తికి సంబంధించి ప్రభుత్వానికి హక్కులు సంక్రమిస్తాయి. ఎనిమీ ప్రాపర్టీ కింది ఇవి దఖలు పడ్డాయి. దీనిని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ తిరస్కరణకు గురయ్యింది. సైఫ్ కుటుంబానికి చెందిన రూ.15వేల కోట్ల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా నిర్ణయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఈ విషయంపై మరోసారి విచారణ జరపాలని, ఏడాదిలోగా తుది నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. తాజా పరిణామంతో ఆ ఆస్తుల యాజమాన్య హక్కులపై సందిగ్ధం నెలకొంది. భోపాల్‌లో సైఫ్ కుటు-ంబానికి అతడి నాన్నమ్మ సాజిదా సుల్తాన్ నుంచి పలు విలాసవంతమైన భవంతులు వారసత్వంగా వచ్చాయి. భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె సాజిదా. ఆయన పెద్ద కుమార్తె అబీదా సుల్తాన్ దేశ విభజన నేపథ్యంలో 1950లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. సాజిదా ఇక్కడే నివసిస్తూ పటౌడీ నవాబు అయిన ఇఫ్తిఖర్ అలీఖాన్(సైఫ్ తా)ను వివాహమాడారు. సాజిదాకు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాలక్రమంలో ఆమె వారసులైన సైఫ్ కుటు-ంబానికి దక్కాయి. అయితే హమీదుల్లాకు చట్టబద్ధ వారసురాలు అబీదా మాత్రమే అని, ఆమె పాక్‌కు వలస వెళ్లినందువల్ల ఎనిమీ యాక్ట్ ప్రకారం ఆ ఆస్తులను కాందిశీకుల ఆస్తులుగా గుర్తిస్తున్నట్లు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ కార్యాలయం 2015లో ప్రకటించింది. దీన్ని సవాలు చేస్తూ సైఫ్ కుటుంబసభ్యులు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా దీనిని కోర్టు తిరస్కరించడంతో ఇక ఆశలు వదులుకోవాల్సిందే.

# అతనిదంతా క్రిమినల్ మనస్తత్వం

కోల్‌కతా,టీమ్‌ఇండియా సీనియర్ బౌలర్ మహ్మద్ షమీపై అతడి మాజీ భార్య హసీన్ జహాన్ సంచలన ఆరోపణలు చేశారు. అతడో కర్కశ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని దుయ్యబట్టారు. ఇటీవల విడాకుల సందర్భంగా తనకు ఇచ్చే భరణం సరిపోదని ఆమె తెలిపింది. తాజాగా అతడు వ్యక్తిత్వం లేని, క్రూరమైన మనస్తత్వం కలిగిన వాడని, అందుకే తనను ఎంతగానో వేధించాడని ఆమె ఆరోపించారు. వీరి విడాకుల కేసుకు సంబంధించి ఇటీవల కలకత్తా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. 2018లో హసీన్ అతడిపై గృహహింస కేసు పెట్టింది. దీనిపై కొన్నేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల హసీన్, ఆమె కుమార్తె సంరక్షణ కోసం రూ.4 లక్షలను భరణం కింద చెల్లించాలని షమిని కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో షమిని విమర్శిస్తూ హసీన్ జహాన్ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్ట్ చేశారు. గత ఏడేళ్లుగా మన మధ్య న్యాయపోరాటం జరుగుతోంది. నీ క్యారెక్టర్ లేనితనం, దురాశ, క్రూరమైన మనస్తత్వంతో సొంత కుటుంబాన్నే చేజేతులా నాశనం చేశావ్. మమ్మల్ని చంపడానికి, మా పరువు తీసి వేధించడానికి, నన్ను ఓడించడానికి నువ్వు ఎంతమంది క్రిమినల్స్‌కు డబ్బు ఇచ్చి ఉంటావ్. దానివల్ల నువ్వు ఏమైనా సాధించావా? పురుషాధిక్య సమాజంలో నాపై నిందలేసి నువ్వు మద్దతు కూడగట్టు-గలవేమో..! కానీ, ఏదో ఒకరోజు నీకు కూడా కష్టకాలం మొదలవుతుంది. అప్పుడు నీకు అండగా నిలిచినవాళ్లే నిన్ను తరిమేస్తారు. చట్టంపై నాకు నమ్మకం ఉందని షమిని ఆమె దుయ్యబట్టారు. క్రిమినల్స్, వేశ్యలకు నువ్వు ఇచ్చిన డబ్బును.. మన కుమార్తె చదువు కోసం వెచ్చించి ఉంటే, మన భవిష్యత్తు కోసం ఉపయోగించి ఉంటే ఇప్పుడు మన జీవితం ఎంతో బాగుండేది. మనమంతా ఎంతో మర్యాదగా జీవించేవాళ్లం అంటూ హసీన్ జహాన్ రాసుకొచ్చారు. నాకు ఆ భగవంతుడు ఎంత ధైర్యాన్ని, సహనాన్ని ఇచ్చాడో చూడు. నిజం కోసం నేను ఏళ్లతరబడి పోరాడుతూనే ఉన్నాను... ఉంటాను కూడా. అందుకే, నువ్వు ఎంతమంది క్రిమినల్స్‌తో చేతులు కలిపినా నన్ను ఏమీ చేయలేకపోతున్నావ్. ఈ 2014లో హసీన్‌తో షమికి వివాహమైంది. వీరికి కుమార్తె జన్మించింది. అయితే, ఆ తర్వాత వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు.

# జగన్ కే ఎందుకిలా ?

అమరావతి,వైసీపీ అధినేత అయిదేళ్ల అధికారమే ఇపుడు ఆయన ప్రతిపక్ష పాత్రకు ప్రతి బంధం అవుతోందా అన్న చర్చ అయితే వస్తోంది. ఏకంగా మూడు దశాబ్దాల పాటు తామే అధికారంలో ఉంటామని అతి ధీమాకు పోయిన వైసీపీ టీడీపీకి తమ ఏలుబడిలో ఇబ్బందులు పెట్టింది. అలా టీడీపీకి ఏమి చేయవచ్చో చెప్పింది. నిజానికి టీడీపీకి ఇలాంటివి తెలియక కాదు.జనామోదం వీటికి ఉండదు అన్న ఆలోచనతోనే 2014 నుంచి 2019 దాకా జగన్ ని వ్యూహాత్మకంగానే కట్టడి చేస్తూ వచ్చింది. అంతే తప్ప ఆయన పర్యటనలకు ఎక్కడా అభ్యంతరం కానీ అడ్డు కానీ చెప్పలేదు. అయితే వైసీపీ అధికారంలో ఉన్నపుడు విపక్షాలను వీలైనంతగా కట్టడి చేయడం చేస్తూ వచ్చింది. దానికి టిట్ ఫర్ టాట్ అన్నట్లుగా తామూ చేస్తున్నామని చెప్పుకోవడానికి ఇపుడు కూటమికి అవకాశం వచ్చింది.ఇక వైసీపీ నేతలను తీసుకెళ్ళి జైళ్లలో వేసినా అలాగే జగన్ పర్యటనలకు షరతులు పెడుతున్నా అవన్నీ కూడా చట్టబద్ధంగానే ఉండేలా కూటమి చూసుకుంటోంది. తాతకు దగ్గులు నేర్పించినట్లుగా వైసీపీ తమ ఏలుబడిలో చేసినవే ఇపుడు శాపాలుగా మారుతున్నాయని అంటున్నారు. ఇక నెల్లూరు విషయం తీసుకుంటే ఆ జిల్లా పర్యటనకు వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ ఈ నెల 3న వెళ్ళాలనుకున్నారు. అక్కడ సబ్ జైలులో రిమాండ్ లో ఉన్న మాజీ మంత్రి వైసీపీ సీనియర్ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించేందుకు జగన్ వెళ్లాలనుకున్నారు.అయితే చివరి నిముషంలో జగన్ టూర్ రద్దు కావాల్సి వచ్చింది. దానికి కారణం జగన్ హెలికాప్టర్ ని సేఫ్ గా ల్యాండ్ చేయడానికి అవసరం అయిన మైదానాన్ని చూపించలేకపోయారు అని వైసీపీ నేతలు చెబుతున్నారు. దాని మీద వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లారు. దాంతో జగన్ నెల్లూరు టూర్ ఎపుడో ఏమిటో తెలియకుండా పోయింది.సరే దాని సంగతి అలా ఉంచి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులను పరామర్శించడానికి జగన్ ఈ నెల 9న అక్కడికి వెళ్లాలనుకున్నారు ఈ మేరకు పార్టీ షెడ్యూల్ ఖరారు చేసింది. అయితే జగన్ ఈ నెల 9న టూర్ కి జిల్లా యంత్రాంగం అనుమతి నిరాకరించింది అని వార్తలు వస్తున్నాయి. ఎందుకు అంటే ఈ నెల 10న చంద్రబాబు అన్నమయ్య జిల్లా పర్యటన ఉందని అందువల్ల పోలీసులు అంతా సీఎం పర్యటనలో ఉంటారని, జగన్ కి అవసరమైన బందోబస్తు చేయడం కష్టమవుతుందని భావించి ఆయన టూర్ డేట్ ని మార్చుకోమని ఆ పార్టీ పెద్దలకు చెప్పారని అంటున్నారు. ఈ నెల 10 తరువాత మరో డేట్ చూసుకుని వస్తే అనుమతి విషయం పరిశీలిస్తామని అంటున్నారు. దీంతో జగన్ చిత్తూరు టూర్ కూడా వాయిదా పడే చాన్స్ ఉంది. దీంతో జగన్ తాడేపల్లి నుంచి జిల్లాల టూర్లు చేసినపుడే ఇలా ఎందుకు జరుగుతోంది అన్న చర్చకు తెర లేస్తోంది. జగన్ జిల్లాల టూర్లు చేయాలని అనుకున్నారు. ఆయన జూన్ నెలలో వరుసగా తెనాలి, పొదిలి, రెంట పాళ్ళ పర్యటనలు చేపట్టి రాజకీయ కాక రగిలించారు. అదే సమయంలో వైసీపీలో ఉత్సాహాన్ని తీసుకుని రాగలిగారు.అయితే ఆ టూర్లలో వివాదాలు కోరి వచ్చాయా

# ఈసీకి జ్ఞానోదయం కలగాలి!

న్యూఢిల్లీ,ఏ ఫిర్యాదు వచ్చినా, ఎలాంటి సమస్య ముంచుకొచ్చినా తక్షణం స్పందించాల్సిన బాధ్యతల్లో ఉన్నవారు మౌనంగా ఉండిపోతే అనుమానాలు బలపడతాయి. అలాంటివారి తటస్థత ప్రశ్నార్థకమవుతుంది. నిరుడు జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లొసుగులపై అప్పట్లోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులు చేసింది. కానీ ఎన్నికల సంఘం(ఈసీ) నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయింది. ఏడాదికాలం గడిచాక ఎట్టకేలకు గురువారం ఢిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఆ ఫిర్యాదులపై వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుల వివరణల్ని విన్నారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఎన్నికల నిర్వహణ లోపరహితంగా ఉండాలి. అనుమానాలకు తావీయకూడదు. కానీ ఏపీలో ఆద్యంతమూ అందుకు విరుద్ధంగా నడిచింది. నోటిఫికేషన్ విడుదల చేసిన మొదట్లోనే కూటమి నాయకులు ఫిర్యాదు ఇవ్వటం తడవుగా జిల్లాల్లో ఉన్నతాధికారుల్ని మార్చారు. అయిదేళ్లుగా అమలవుతున్న పథకాలను సైతం ఆపేయాలని ఆదేశించారు. నిర్ణయం తీసుకునేముందు కనీసం కూటమి నేతల ఆరోపణలకు ఆధారాలున్నాయో లేదో చూసుకోవాలన్న స్పృహ కూడా లేకపోయింది. ఫలితంగా అలాంటి జిల్లాల్లో పోలింగ్ రోజున ఎన్ని అవకతవకలు చోటుచేసుకున్నాయో మీడియా సాక్షిగా బయటపడింది. చాలా గ్రామాల్లో బడుగు వర్గాల్ని ఓటేయకుండా భయభ్రాంతులకు గురిచేశారు. వారి దౌర్జన్యాలకు అనేకమంది తలలు పగిలాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. కొంపా గోడూ వదిలి చెట్లల్లో పుట్టల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. అటు తర్వాత ఇక ఎదురులేదనుకుని ఈవీఎంలను దొంగవోట్లతో నింపేశారు. వీటిపై ఏ క్షణానికాక్షణం ఫిర్యాదులు వెల్లువెత్తినా దిక్కులేకుండా పోయింది. పోలైన నాలుగు కోట్లకుపైగా ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 6 తర్వాతే పడ్డాయి. ఇదంతా మాయాజాలం అనిపించదా? ఎన్నికలు ముంగిట్లోకొచ్చాక ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై వదంతులు వ్యాపింపజేసినా ఈసీలో వెంటనే కదలిక లేదు. అటు తర్వాత చంద్రబాబు, లోకేష్‌లపై కేసుపెట్టాలని ఆదేశించారు సరే... దాని అతీగతీ ఏమిటో ఎవరికీ తెలియదు. వేరే రాష్ట్రాల్లో విపక్షాలు ప్రధాని నరేంద్ర మోదీని ఏమైనా అంటే నొచ్చుకుని వెనువెంటనే చర్యలకు ఉపక్రమించిన ఈసీ... అప్పటి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాళ్లతో కొట్టాలని బాబు నోరు పారేసుకున్నా చోద్యం చూసింది. ఇవన్నీ ఒక ఎత్తయితే లెక్కింపు నాడు వెల్లడైన వైపరీత్యాలకు అంతూ దరీ లేదు. పోలైన ఓట్లకూ, లెక్కించిన ఓట్లకూ మధ్య భారీ వ్యత్యాసాలున్నాయి. నిరుడు మే నెల 13న రాత్రి 8 గంటలకు ఏపీ పోలింగ్ శాతం 68.12 అని ఈసీ ప్రకటించింది. రాత్రి 11.45కి దీన్ని సవరించి 76.50 శాతమన్నారు. మరో నాలుగు రోజులకల్లా అది 80.66 శాతం అని మాట మార్చారు. మొదట, చివరి ప్రకటనల్లోని అంకెల మధ్య 12.5 శాతం తేడా ఉంది. గతంలోనూ మారిన సందర్భాలు లేకపోలేదు. కానీ ఈ తేడా ఒక శాతంకన్నా ఎప్పుడూ ఎక్కువ లేదు. పర్యవసానంగా సగటున ఒక్కో శాసనసభ స్థానంలో 28,000 ఓట్లు, లోక్‌సభ స్థానం పరిధిలో 1.96 లక్షల ఓట్లు పెరిగాయి. ఇది 87 అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటముల్ని నిర్దేశించింది. అంతేనా... పోలింగ్ ముగిసిన రోజున ఈవీఎంలలో ఉన్న చార్జింగ్ శాతం కౌంటింగ్ రోజుకు అమాంతం పెరిగింది. పదో, పదిహేను శాతమో చార్జింగ్ ఉన్నట్టు కనబడింది కాస్తా 98 శాతానికి ఎగబాకింది. రీచార్జబుల్ బ్యాటరీలు కనుక అలాంటిది జరగదని చెప్పటం తప్ప ఈసీ దగ్గర సంతృప్తికరమైన జవాబు లేకపోవటం దిగ్భ్రాంతికరం.బాహాటంగా బయటపడిన ఇలాంటి అవకతవకల పర్యవసానంగానే ఈవీఎంలలోని ఓట్లూ, వీవీ ప్యాట్ స్లిప్‌ల సంఖ్యనూ లెక్కేసి, అవి ఒకదానితో ఒకటి సరిపోయాయో లేదా తేల్చాలని వైఎస్సార్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలాగే పోలింగ్ కేంద్రాల్లో సీసీ టీవీ ఫుటేజ్‌లు ఇవ్వాలని కూడా కోరింది. ఇవేమీ గొంతెమ్మ కోరికలు కాదు. నదురూ బెదురూ లేకుండా కూటమి నేతలు తిమ్మిని బమ్మి చేసిన పర్యవసానంగానే వైఎస్సార్ కాంగ్రెస్ ఈ డిమాండ్లు చేసింది. తమ నిర్వాకం కళ్లముందు కనబడుతున్నప్పుడు మొండిగా అవేమీ ఇచ్చే ప్రసక్తి లేదని చెప్పటం ప్రజాస్వామికమేనా? అసలు సీసీ టీవీ ఫుటేజ్‌లూ, వీవీ ప్యాట్‌లూ ఎందుకొచ్చాయో, ఏ ప్రయోజనాన్ని ఆశించి ఎన్నికల ప్రక్రియలో వాటిని చేర్చాల్సివచ్చిందో సీఈసీకి, మరో ఇద్దరు కమిషనర్లకూ తెలుసా? ఎన్నికల్లో పాల్గొన్న పార్టీలు అనుమానాలు వ్యక్తం చేసినప్పుడు వాటిని నివృత్తి చేయటం వారి బాధ్యత కాదా? కనీసం హేతుబద్ధమైన జవాబైనా ఇచ్చే ప్రయత్నం చేయొద్దా? ఈసీ తీరు దేవతా వస్త్రాల కథను తలపిస్తోంది. కోట్లాది రూపాయలు వ్యయం చేసి సీసీ కెమెరాలూ, వీవీ ప్యాట్‌లు సమకూర్చుకోవటం, వాటిని ఉపయోగంలోకి తీసుకురావటం%-% తీరా రాజకీయ పార్టీలు సందేహం వెలిబుచ్చినప్పుడు వెల్లడించటం కుదరదని మొండికేయటం, నిబంధనలు ఒప్పుకోవనటం ఏం నీతి? పారదర్శకత లేని ఎన్నికలు జరపటం ఎవర్ని ఉద్ధరించటానికి? ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలకూ శిరోధార్యం రాజ్యాంగం. అది నిర్దేశించిన ప్రకారం నడుచుకోవాలి తప్ప ఇతరేతర ప్రభావాలకు లోను కాకూడదు. మళ్లీ బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలకు వెళ్లాలన్న డిమాండ్ సర్వత్రా వినిపించటానికి తమ నిర్వాకం కూడా కారణమని ఈసీ తెలుసుకోవాలి. ఈసీ తటస్థతపై తలెత్తుతున్న సందేహాల కారణంగానే ఇప్పుడు బిహార్‌లో ప్రారంభించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఓటర్ల జాబితాల నవీకరణకు చేస్తున్న ప్రయత్నాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికైనా ఈసీ వైఖరి మారాలి. పారదర్శకంగా వుండే ప్రయత్నం చేయాలి.

# సాంకేతిక సామర్థ్యంతో చైనా బెదిరింపు




న్యూఢిల్లీ,సెల్ ఫోన్లు దగ్గరనుంచి ఔషధాలకు ఉపయోగించే మూలకాల విషయంలోనూ చైనాపైనే భారత్ ఆధారపడుతుండడం గత కొన్ని దశాబ్దాలుగా పరిపాటిగా సాగుతోంది. భారత్ ప్రభుత్వం స్వదేశీ తయారీ, ఆత్మనిర్భర్ అనే నినాదాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన ఇంజినీర్లనే ఆయుధంగా చైనా ఉపయోగించి భారత్‌ను బెదిరిస్తోంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి భారత్ తన ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని విస్తృతంగా పెంచుకోవలసిన అవసరం ఏర్పడింది. చైనా ఇటీవల ఐ ఫోన్ తయారీ సంస్థ 'ఫాక్స్‌కాన్' కు చెందిన భారతీయ పరిశ్రమల్లోంచి చైనా ఇంజినీర్లను వెనక్కి తీసుకోవాలని ఆదేశించడం ప్రత్యేకంగా గమనించవలసిన విషయం. ఫాక్స్‌కాన్ సంస్థ చైనా లోను, అంతర్జాతీయంగా ఎన్నో కేంద్రాలను నెలకొల్పి పేరుగడించిన ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ సంస్థ.తమిళనాడు, కర్ణాటక ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీల్లోని సిబ్బందిలో చైనా ఇంజినీర్ల భాగం 1 శాతం కన్నా తక్కువే అయినప్పటికీ, వారెంతో కీలకమైన ఇంజినీరింగ్ పాత్రను నిర్వహిస్తున్నారు. వారిని వెనక్కి తీసుకోవడంలో చైనా అసలు ఉద్దేశం ఈ ఫ్యాక్టరీల్లో ఉత్పత్తికి అంతరాయం కలిగించడమే. దీంతోపాటు భారత్ పారిశ్రామిక అవసరాలకు ముఖ్యమైన క్లిష్టమైన యంత్రాలను సరఫరా చేయడంలో విపరీత జాప్యం కలిగించాలన్న ఎత్తుగడ కూడా ఉంది.ఇది ఒక విధంగా ఆర్థికపరమైన బెదిరింపు. అంతర్జాతీయ సంస్థల కార్యకలాపాలను అణగదొక్కడానికి, వారి ఉత్పత్తి స్థావరాలను మార్చడానికి చైనా తన తయారీ సామర్థ వ్యూహాలను అమలు చేస్తుంటుంది. అమెరికాతో వాణిజ్య యుద్ధ తీవ్రతను తగ్గించడానికి చైనా ఇటీవల ప్రయత్నించినప్పటికీ, దాంతో సంబంధం లేకుండా చైనా అమెరికా వ్యూహాత్మక ఆర్థిక పోరాటంలో చిక్కుకోవడంతో భారత్ వంటి దేశాలు ఇరుకున పడుతున్నాయి. అమెరికాతో వియత్నాం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంలో అమెరికాకు ఎగుమతి అయ్యే వియత్నాం ఉత్పత్తులపై 20 శాతం సుంకం విధించడానికి అమెరికా నిర్ణయించింది.అయితే వియత్నాం మీదుగా అమెరికాకు వెళ్లే చైనా ఉత్పత్తులపై 40 శాతం సుంకం విధిస్తోంది. అంటే చైనా ఉత్పత్తులను నిరోధించడానికే అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా తన వాణిజ్య భాగస్వాముల ద్వారా రాయితీలను భారీగా పొంది తన మార్కెట్‌ను బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా, చైనా తన వాణిజ్య భాగస్వాములను తన ఉత్పత్తుల సరఫరా గొలుసులో బంధించడానికి తన తయారీ సామర్థ్యాన్ని వినియోగిస్తోంది. 2001లో ప్రపంచ వాణిజ్య సంస్థలో చైనా సభ్యత్వం పొందిన తరువాత పశ్చిమ దేశాలు, చైనా అవ్యక్త ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. చైనా నూతన ఆవిష్కరణలు, ఉన్నత స్థాయి తయారీపై దృష్టి కేంద్రీకరిస్తుండగా, తక్కువ విలువ గలిగిన తయారీని మిగతా దేశాలకు వదిలివేసింది. ఈ అవకాశాన్ని చైనా బాగా వినియోగించుకుని భారీ స్థాయిలో తన ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు సరఫరా చేయడం, వివిధ విభాగాల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవడంలో ముందుంటోంది.ఇంతే కాకుండా ప్రపంచం మొత్తం మీద లభించే చైనాలోనే అత్యధిక శాతం అపురూప ఖనిజాలు లభిస్తున్నాయి. వీటిని 90 శాతం వరకు చైనా శుద్ధి చేయగలుగుతోంది. ఇక భారత్ విషయానికి వస్తే చైనా సరఫరా చేసే ఎపిఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌నెస్), ఎలక్ట్రానిక్ పరికరాల భాగాలు, కెమికల్స్, మ్యాగ్నెట్లు, మొదలైనవి ఎంతో బ్రహ్మాండంగా ఉంటున్నాయి. ఈ విధంగా చైనాపై ఆధారపడడాన్ని బాగా తగ్గించుకోవాలంటే ఉత్పత్తి అనుసంధాన రాయితీలు (పిఎల్ఐ) పథకాలను భారత్ ఎంతో ఆశాజనకంగా తీర్చిదిద్దాలి. స్వదేశీ తయారీని, సరఫరాను పటిష్టంగా రూపొందించడానికి చాలా అవసరాలు తీర్చవలసి ఉంటుంది. ఈ మేరకు సాంకేతిక విద్యపై సునిశిత పరిశీలన తప్పనిసరి. భారత్‌లో ఏటా 1.5 మిలియన్ ఇంజినీర్లు తయారవుతున్నారు. వీరిలో 10 శాతం మంది మాత్రమే 2024లో ఉద్యోగాలు పొందగలిగారు.ఇంకా మరికొన్ని అంచనాల ప్రకారం భారత్‌లో ఏటా 6 లక్షల మంది ఐటి ఇంజినీర్లు తయారవుతున్నారు. అయితే పరిశ్రమలకు కావలసింది మెటీరియల్ ఇంజినీర్లు. పరిశ్రమ ఉత్పత్తుల తయారీకి వీరి అవసరం చాలా ఉంది. కానీ వీరి సంఖ్య తగినంతగా లేదు. ఈ ఇంజినీర్ల వాసి, రాశి పెంచుకోవాలంటే ఆయా సాంకేతిక రంగాల్లో ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టడం, ఆ మేరకు పాలనా విధానాలు అమలు చేయడం ఎంతో అవసరం. చైనా నుంచి సాంకేతికంగా నైపుణ్యంలోనూ, కీలక ఉత్పత్తుల సరఫరా లోనూ ఎదురవుతున్న సవాళ్లను, బెదిరింపులను ఎదుర్కోవాలంటే భారత్ ముందు చూపుతో నైపుణ్యంతో కూడిన సాంకేతికతను అభివృద్ధి చేయాలి. నిదానంగా తన సాంకేతిక నైపుణ్యంతో తయారీ రంగాన్ని విస్తరింప చేసుకోవాలి. లేకుంటే కీలకమైన యంత్రాల విడిభాగాల తయారీ, సరఫరాలో చైనా ముందు భారత్ దుర్బలంగా మారుతుంది.అయితే ఇటీవల భారత ప్రభుత్వం రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్, ఉద్యోగాల కల్పనకు ప్రోత్సహించడానికి బడ్జెట్‌లో రూ. 2 లక్షల కోట్ల వరకు వెచ్చించడానికి నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయమైన ఉద్దేశం అని చెప్పవచ్చు. వచ్చే రెండేళ్లలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించాలన్నదే ఈ పథకం లక్ష్యం. ఉపాధి అనుసంధాన ప్రోత్సాహక పథకంతోపాటు ప్రైవేట్ రంగ ఆవిష్కరణల కోసం తయారీ రంగం, ఆవిష్కరణలు, ఉద్యోగాల కల్పన, తదితర రంగాలను ప్రోత్సహించడానికే ఈ అద్భుతమైన ప్రణాళిక అని ప్రభుత్వం చెబుతోంది. ఇలాంటివి సత్ఫలితాలు అందిస్తే చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్ వర్ధిల్లుతుందని ఆశించవచ్చు.

# డెడ్ అయిన పార్టీ డెడ్‌లైన్లు పెట్టడమేంటి?

హైదరాబాద్,కేటీఆర్ గుర్తింపు సమస్యతో బాధపడుతున్నాడని, ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో చర్చిద్దాం రా అంటే...ప్రెస్ క్లబ్ కు రమ్మనడం ఏంటని మంత్రి సీతక్క సెటైర్ వేశారు. మంత్రి సీతక్క ప్రజా భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు కేటీ-ఆర్ స్పందించిన తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కు కేటీ-ఆర్ కు అర్థం కానట్లు- ఉందని, విదేశాలలో ఉన్న కేటీఆర్ తెలంగాణకు వచ్చినట్లు- చెప్పేందుకే ప్రెస్ మీట్ పెట్టినట్టుగా ఉందన్నారు. ప్రజలు ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్నది ప్రెస్‌క్లబ్ లో చర్చించడానికి కాదని, అసెంబ్లీలో చర్చించ మంటే.. ప్రెస్ క్లబ్ కు రావాలని కోరడం ఏంటని ఆమె అన్నారు. 72 గంటల డెలడైన్ అంటూ అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నాడని, డెడ్ అయిన పార్టీ డెడ్ లైన్ పెట్టడం

# ఎన్‌డిఎకు జాతి ప్రయోజనాలే ముఖ్యం

న్యూఢిల్లీ, ఎన్డీఏ ప్రభుత్వానికి జాతీయ ప్రయోజనాలే మొదటి ప్రాధాన్యత అని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సుంకాల విషయంలో ప్రధాని ఓ నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం దేశ ప్రజల గురించి పట్టించుకోక పోవడం వల్ల బలహీనంగా మారిన దేశాన్ని బలమైన, అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారన్నని తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై గోయల్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ నేతలు జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకున్నారని వ్యాఖ్యానించారు. భారత్‌కు ప్రపంచంలోని ఏ దేశంతో అయినా పోటీ- పడగలిగే సామర్థం ఉందని తాము విశ్వాసిస్తున్నామన్నారు. ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటే మాత్రమే ఏ దేశంతో అయినా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ సంసిద్ధతను వ్యక్తం చేస్తుందని గోయల్ అన్నారు. అలా కానీ పక్షంలో ఎట్టిపరిస్థితుల్లోనే ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాలను ఏర్పరుచుకోమని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్.. మారిషస్, యునైటె-డ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, నార్వే, యూకే వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని గోయల్ వెల్లడించారు. ప్రస్తుతం ఈయూ దేశాల కూటమి, అమెరికా, ఒమన్, పెరూ, చిలీ సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందని అన్నారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. యూఎస్ పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు దేశం ఎప్పుడూ తొందరపడదని అన్నారు. రెండు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే అంగీకరిస్తుందన్నారు. అమెరికాతో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి అగ్రరాజ్యాన్ని సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ఎ÷-లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. అయితే ఈ సడలింపులను ఆమోదిస్తే, మన దేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. వాణిజ్య చర్చల నిమిత్తం ఇటీవల అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగివచ్చింది. దీంతో అమెరికా-భారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

# ఉత్కంఠ రేపుతోన్న సైలెంట్

హైదరాబాద్, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది కరీంనగర్ జిల్లానే.. అంతేకాకుండా గులాబీ పార్టీకి ఆజిల్లానే ఊపిరి పోసింది.. అప్పుడు తెలంగాణ ఉద్యమ సమయంతో పాటు.. అధికారంలోకి రావడంలో కరీంనగర్ జిల్లానే అండగా నిలిచింది.. అలాంటి జిల్లాలో బిఆర్ఎస్ నేతలు కొంతకాలంగా పూర్తిగా సైలెంటైై పోయారు. కీలక నేతలంతా హైదరాబాద్‌లోనే మకాం వేస్తున్నారు. ఒక్కటి.. రెండు కార్యక్రమాలు చేసి.. చేతులు దులుపుకుని వెళ్లి పోతుండటంతో గులబీ శ్రేణులకు దిశానిర్ధేశం లేకుండా పోయిందంట

బీఆర్ఎస్‌కు కంచుకోటగా నలిచిన కరీంనగర్ జిల్లా

గతంలో.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గులాబీ పార్టీకి కంచుకోట.. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి 2018 ఎన్నికల వరకు.. అక్కడ ఆ పార్టీ పట్టు నిలుపుకుంటూ వచ్చింది. అన్ని ఎన్నికల్లో 90 శాతానికి పైగా సీట్లు బీఆర్ఎస్ ఖాతాలో పడ్డాయి. 2023 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గాలిలో%ొ%13 స్థానాలకు గాను 5 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. మిగతా నియోజకవర్గాల్లో కూడా గట్టి పోటీ ఇచ్చింది. సహజంగా కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత తొలి 6 నెలలు ప్రతిపక్షాలు సైలెంట్‌గా ఉంటాయి.

16 నెలలు గడుస్తున్నా కనపించని బీఆర్ఎస్ దూకుడు

అయితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా.. బీఆర్ఎస్ దూకుడు మాత్రం కనబడటం లేదు. ఇప్పటికీ కరీంనగర్ జిల్లాలో గులాబీ పార్టీ క్యాడర్ బలంగానే ఉంది.. హుజురాబాద్ ఎంఎల్ఏ కౌశిక్ రెడ్డి ఒక్కరే కాస్తా దూకుడుగా వెళ్తున్నారు. మిగితా నేతలంతా.. ఏదైనా పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమం ఉన్నప్పుడు మాత్రమే స్పందిస్తున్నారు. కేటిఆర్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేస్తున్నారు. మిగితా సమయాల్లో చడీ చప్పుడు చేయడం లేదు.

మాజీ ఎమ్మెల్యేలు మనోహర్ రెడ్డి, పుట్ట మధు, కోరుకంటి చందర్

గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులంతా సైలెంటయ్యారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మంథని మాజీ ఎంఎల్ఏ పుట్ట మధు, రామగుండం మాజీ ఎంఎల్ఏ కోరుకంటి చందర్, మానకొండూరు మాజీ ఎంఎల్ఏ రసమయి బాలకిషన్, హుస్నాబాద్ మాజీ ఎంఎల్ఏ సతీష్ బాబు తదితర నేతలు పూర్తిగా దూకుడు తగ్గించారు. గెలిచిన ఎంఎల్ఏలు మాత్రం అప్పుడప్పుడు ప్రెస్ మీట్ పెడుతూ ఉన్నామంటే ఉన్నాం అనిపించుకుంటున్నారు.

సైలెంట్ అయిన మాజీ మంత్రి గంగుల కమలాకర్

త్వరలో స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఇక్కడ మాత్రం అందుకు తగ్గట్టుగా సమావేశాలు జరగడం లేదు. క్యాడర్ను ఏ మాత్రం సమయత్తం చేయడం లేదు. మెజారిటీ నేతలు అంతా హైదరాబాద్లో ఉంటున్నారు. పార్టీ ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తే మాత్రం నియోజకవర్గాలకు వచ్చి కార్యక్రమాలు నిర్వహించి వెళ్తున్నారు. ఎప్పుడు దూకుడుగా ఉండే మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కూడా సైలెంట్ అవ్వడం చర్చనీయాంశంగా మారింది.

సమయం చూసి దూకుడు పెంచుతారంట

గతంలో తరచూ పార్టీ సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు.. ఇప్పుడు ఆరు నెలల నుంచీ ఒక్క సమావేశం కూడా నిర్వహించ లేదు. ప్రధాన పార్టీ బీఆర్ఎస్ సైలెంట్గా ఉండటంతో.. కాంగ్రెస్‌తో పాటు బిజెపి ఆ జిల్లాలో బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. అయితే తాము సమయం చూసి దూకుడు పెంచుతామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారంట. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి కాంగ్రెస్‌కి గుణపాఠం చెబుతామని క్యాడర్‌కి భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారంట.అదేమంటే ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వంస్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ముందుకు రావడం లేదని అంటున్నారంట. మరి గులాబీ నేతలు యాక్టివ్ అయ్యేది ఎప్పుడో కాని అప్పటికి ఆ పార్టీ క్యాడర్ చెల్లచెదురు అయిపోయే పరిస్థితి కనిపిస్తోంది. మొత్తమ్మీద జిల్లా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ పగ్గాలు చేజారక మౌనముద్ర దాలుస్తుండటం .. కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమవ్వడం, తమ నేతలు అడ్రస్ లేకుండా పోవడంతో జిల్లా పార్టీ శ్రేణులు ఏ చిన్న పని వచ్చినా దిక్కులు చూడాల్సి వస్తోందంట.

# ఈ నెలాఖరులోపు అన్ని పదవుల భర్తీకి కాంగ్రెస్ ప్లాన్..!



హైదరాబాద్, సాధ్యమైనంత తొందరగా లోకల్ బాడీ పోల్స్ నిర్వహించాలి. కానీ అంతకంటే ముందే అన్ని పదవులు భర్తీ చేయాలని ప్లాన్ చేస్తోంది రేవంత్ సర్కార్. పార్టీ పదవులతో పాటు ప్రభుత్వంలోని పోస్టులన్నీ ఫిలప్ చేసేందుకు రంగం సిద్ధమైందట. ఈ నెలాఖరులోపు అన్ని పోస్టుల పంపకాలు పూర్తి చేయాలని..స్వయంగా ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గేనే డెడ్ లైన్ పెట్టారట. దీంతో కాంగ్రెస్‌లో పదవుల పంపకాలపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇంతకీ ఏయే పోస్టులను భర్తీ చేయబోతున్నారు? పదవుల రేసులో ఉన్న ఆశావహులెవరు?ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్న కాంగ్రెస్ నేతల ఆశలు నెరవేరబోతున్నాయి. ఇటు పార్టీ పదవులు, అటు ప్రభుత్వంలోని కార్పొరేషన్ పదవులను భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. నామినేటెడ్ పదవుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పదే పదే మంత్రులకు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు చొరవ తీసుకుని..పార్టీలో పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని పలుమార్లు చెబుతూ వచ్చారు.లేటెస్ట్‌గా గాంధీభవన్‌లో జరిగిన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాల్లో పాల్గొన్న పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారట. అంతేకాదు పోస్టుల భర్తీపై డెడ్ లైన్ కూడా పెట్టారంటున్నారు. ఈ నెలాఖరులోపు నామినేటెడ్ పోస్టుల జాబితా సిద్ధం చేసి పంపాలని సీఎం రేవంత్ రెడ్డికి చెప్పిన ఖర్గే..అందుకోసం పీసీసీ చీఫ్ బాధ్యత తీసుకొని పనిచేయాలని ఆదేశించారట.రాష్ట్ర ప్రభుత్వం త్వరలో లోకల్ బాడీ ఎన్నికలకు నిర్వహించాలని భావిస్తోంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో సెప్టెంబర్‌లోగా లోకల్ బాడీ ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఆగస్టులో స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టేందుకు రంగం సిద్ధం అవుతోందట. అయితే ఈ లోపు పార్టీ నాయకత్వాన్ని ఎన్నికల సమరానికి రెడీ చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా ఇంకా నామినేటెడ్ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయకపోవడంతో నేతలు నారాజ్‌లో ఉన్నారు. దీంతో సెకండ్ గ్రేడ్ లీడర్లను సంతృప్తి పరిచేందుకు ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలనుకుంటున్నారట.ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో 38 కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులను భర్తీ చేసిన సీఎం రేవంత్..మిగిలిన పదవులను కూడా పంచేయాలనుకుంటున్నారు. అలాగే మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, దేవాలయ కమిటీలను భర్తీ చేయాలని చూస్తోంది ప్రభుత్వం. అన్ని కార్పొరేషన్ ఛైర్మన్లు, కమిటీలు, డైరెక్టర్లు కలిపి దాదాపు వంద మంది నేతలను అకామిడేట్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట.ఇక మంత్రిపదవి రాని వారిని క్యాబినెట్ ర్యాంకున్న కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా నియమించాలని పార్టీ నాయకత్వం ఆలోచన చేస్తోంది. అందుకు అనుగుణంగా మల్లికార్జున ఖర్గే స్వయంగా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న ఆరుగురు నేతలను పిలిచి మీకు బెర్త్ కల్పించలేమని చెప్పేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ పదవిని ప్రేమ్‌సాగర్ రావుకు, ఆర్టీసీ లేదా ఫ్యూచర్ సిటీ కార్పొరేషన్‌ను మల్‌రెడ్డి రంగారెడ్డికి, రామ్మోహన్‌రెడ్డి, బాలునాయక్, ఆదిశ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డిలకు కూడా పలు కార్పొరేషన్ పోస్టులను ఆఫర్ చేశారట. ఇక మిగిలిన మూడు మంత్రి పదవులను కూడా ఈ నెలాఖరులోపు భర్తీ చేసే అవకాశాలున్నాయి.ఈ నెల మూడో వారానికి ఆషాడ మాసం ముగియనుంది. శ్రావణం వచ్చాక మంచి రోజు చూసుకొని క్యాబినెట్ విస్తరణ చేసి..ఆగస్టులో లోకల్ బాడీ ఎన్నికల సమరానికి వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన చేస్తున్నారట. స్వయంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశించిన నేపథ్యంలో ఈ నెలాఖరులోపు నామినేటెడ్ పోస్టులపై భారీగా ఆశలు పెట్టుకున్నారట నేతలు. పార్టీ పదవులు, కార్పొరేషన్ పోస్టుల కోసం లాబీయింగ్ చేస్తున్నారట. అధ్యక్షుడి ఆదేశాల ప్రకారం నెలాఖరులోపు పదవుల పంపకం పూర్తి అవుతుందా..? మరోసారి పిక్చర్ అబీ బాకీ హై అంటారా అనేది చూడాలి.

# పార్టీ ఆఫీస్‌కి రారు,ఏ కార్యక్రమానికి హాజరవరు..!

హైదరాబాద్,ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అండగా ఉండి, పార్టీ యాక్టివిటీలో పాల్గొనాల్సిన ఎంపీలు ఇలా అంటీ ముట్టనట్లు, అసలు బీఆర్ఎస్‌లోనే ఉన్నారా లేరా అన్నట్లు వ్యవహరించడంతో పార్టీ ముఖ్య నేతల నుంచి క్యాడర్ వరకు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. ఆ పార్టీ ఎంపీలు తెలంగాణ భవన్‌కు రావడం లేదు. పోనీ ఢిల్లీలో రాజ్యసభకు వెళ్తున్నారా అంటే అదీ లేదు. అవును.. గులాబీ పార్టీలో ఉన్నదే నలుగురు ఎంపీలు. వాళ్లు కూడా రాజ్యసభ సభ్యులు. కానీ సదరు ఎంపీలు రాజ్యసభ నుంచి మొదలు తెలంగాణ భవన్ వరకు ఎక్కడా కనిపించడం లేదని అంటున్నాయి బీఆర్ఎస్ వర్గాలు. పార్టీ ఆఫీస్ వైపు కన్నెత్తి చూడటం లేదట. ఏ కార్యక్రమానికి ఆ ఎంపీలు హాజరవ్వట్లేదట. అందుకే సదరు ఎంపీలు ఎక్కడా అన్న చర్చ జరుగుతోంది. ఇంతకు ఎవరా ఎంపీలు? ఏంటా కథ?తెలంగాణలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్‌లో ఉన్నదే నలుగురు ఎంపీలు. వాళ్లు కూడా రాజ్యసభ సభ్యులే. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటును కూడా గెల్వలేదు. దీంతో గులాబీ పార్టీలో ఉన్నది కేవలం రాజ్యసభ సభ్యులే ఉన్నారు. కేఆర్ సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథి రెడ్డి, దామోదర్ రావులు బీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ కు చెందిన ఎంపీలు.

బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ వైపు కన్నెత్తి చూడటం లేదట..!

ఈ నలుగురు పార్టీకి అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారట. అందులో మరీ ముఖ్యంగా ముగ్గురు ఎంపీలైతే ఎక్కడా కనిపించడం లేదన్న చర్చ పార్టీలో జరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో యాక్టీవ్‌గా పాల్గొనడం లేదంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ వైపు కూడా కన్నెత్తి చూడటం లేదని పార్టీ వర్గాలే గుసగుసలు పెట్టుకుంటున్నాయి. అడపాదడపా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా..మిగతా ముగ్గురు ఎంపీలు పార్థసారథి రెడ్డి, దామోదర్ రావు, కేఆర్ సురేశ్ రెడ్డిలు ఎక్కడా కనిపించని పరిస్థితి.అధికార కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై విమర్శలు చేసినా, పార్టీ అధినేత కేసీఆర్‌పై ఆరోపణలు, విమర్శలు గుప్పించినా ఈ నలుగురిలో ముగ్గురు ఎంపీలు సైలెంట్‌గానే ఉంటున్నారట. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా ఈ ఎంపీలు యాక్టీవ్‌గా పాల్గొనడం లేదంటున్నారు. తెలంగాణ భవన్‌లో కనీసం మీడియా సమావేశం కూడా పెట్టడం లేదని చెబుతున్నారు. ఈ నలుగురిలో పార్థసారథి రెడ్డి, కేఆర్ సురేష్ రెడ్డి, దామోదర్ రావు అయితే అసలే కనిపించడం లేదట.





రాజ్యసభలో నోరు కూడా మెదపరు..!

ఇక రాజ్యసభలో కూడా ఈ బీఆర్ఎస్ ఎంపీల పర్ఫామెన్స్ అంతంత మాత్రమేనట. తెలంగాణకు సంబంధించిన అంశాలపై రాజ్యసభలో గళమెత్తిన సందర్భాలు తక్కువేనని అంటున్నారు. చాలా వరకు రాజ్యసభలో కూడా నోరు మెదపరని..ఒకవేళ ఎప్పుడో ఒకసారి మాట్లాడినా అది కూడా ముక్తసరిగానేనని గుర్తు చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. ఈ నలుగురిలో వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేష్ రెడ్డిలు రాజ్యసభలో అప్పుడప్పుడు మాట్లాడినా..మిగతా ఎంపీలైన పార్థసారథి రెడ్డి, దామోదర్ రావు ఇప్పటివరకు మాట్లాడిన దాఖలాలే లేవట.పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యక్రమాల్లో కూడా ఈ ఎంపీలు కనపడట్లేదట. కేవలం అధినేత కేసీఆర్ పాల్గొనే సమావేశాల్లో తప్ప మరే కార్యక్రమానికి వీళ్లు రారరని తెలంగాణ భవన్‌లో చర్చ జరుగుతోంది. అందుకే ఈ నలుగురు ఎంపీలు అసలు పార్టీలో ఉన్నట్లా.? లేనట్లా.? అనే చర్చ జరుగుతుందట.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అండగా ఉండి, పార్టీ యాక్టివిటీలో పాల్గొనాల్సిన ఎంపీలు ఇలా అంటీ ముట్టనట్లు, అసలు బీఆర్ఎస్‌లోనే ఉన్నారా లేరా అన్నట్లు వ్యవహరించడంతో పార్టీ ముఖ్య నేతల నుంచి క్యాడర్ వరకు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. ఇలాంటి వారికి ఎందుకు రాజ్యసభ పదవులు కట్టబెట్టారని వాపోతున్నారట బీఆర్ఎస్ నేతలు. రాబోయే రోజుల్లో అయినా ఈ ఎంపీలు మౌన వీడతారో? లేదో చూడాలి.

# జిందాల్ భూములపై రాజకీయ రచ్చ..!

అమరావతి, ఆ భూములపై ఉన్న పంచాయితీ ఇప్పటిది కాదు. ఏకంగా 15ఏళు గా ఆ ల్యాండ్స్‌పై రచ్చ జరుగుతూనే ఉంది. ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చిన జిందాల్ భూముల వ్యవహారం..పొలిటికల్ వార్‌కు దారితీస్తోంది. జిందాల్ భూముల్లో MSME పార్క్ రాబోతోందన్న ప్రచారంతో..గిరిజనులు, స్థానికులు రోడ్డెక్కారు. వారికి వైసీపీ ఎమ్మెల్సీ అండగా నిలిచారు. ఎమ్మెల్సీకి చెక్ పెట్టే ప్రయత్నంలో ఎమ్మెల్యే చేసిన ప్లాన్ వికటించినట్లు అయింది. ఇలా రాజకీయ ఆధిపత్య పోరుతో జిందాల్ భూముల వ్యవహారం రచ్చకు దారితీసింది. ఇంతకీ ఈ భూముల కథేంటి.? పార్క్ ప్రతిపాదన ఎక్కడి నుంచి వచ్చింది?ఉత్తరాంధ్ర సెంట్రిక్‌గా జిందాల్ భూముల రచ్చ రాజకీయ వేడిని రాజేస్తోంది. ప్రత్యేకంగా విజయనగరం జిల్లాలో జిందాల్ ల్యాండ్స్ ఇష్యూ ..పొలిటికల్ రప్చర్‌కు దారితీసింది. జిందాల్ భూముల్లో MSME పార్కులు ఏర్పాటు చేస్తారనే ప్రచారం గందరగోళానికి తెరలేపింది. జిందాల్ భూములున్న ఎస్.కోట నియోజకవర్గంలో ఈ వ్యవహారం రాజకీయ దుమారానికి ఆజ్యం పోయగా, అది కాస్త చినికి చినికి గాలి వానలా మారి జిల్లాకు వ్యాపించింది.జిందాల్ భూముల వ్యవహారం ఈనాటిది కాదు. 2007-2008లో ఎస్.కోట మండలం బొడ్డవర ప్రాంతంలో జిందాల్ కంపెనీ%ా%అల్యూమినియం పరిశ్రమ ఏర్పాటు కోసం భారీగా భూసేకరణ చేసింది. దాదాపు 1165 ఎకరాలు సేకరించగా, అందులో 188 ఎకరాలు జిరాయితీ కాగా, మిగిలినవి గిరిజన్లకిచ్చిన అస్సైన్డ్ భూములు. అయితే జిందాల్ అల్యూమినియం పరిశ్రమకు అవసరమైన ముడిసరుకు బాక్సైట్ గనులకు అప్పటి కేంద్రం ప్రభుత్వం నిరాకరించడంతో పరిశ్రమ ఏర్పాటు ఆగిపోయింది. ఇక అప్పటి నుంచి నేటి వరకు ఆ భూములు జిందాల్ కంపెనీ చేతిలో ఖాళీగానే ఉన్నాయి.ఈ భూముల్లో MSME పార్కులు ఏర్పాటు చేసేలా గత వైసీపీ ప్రభుత్వం 2022లో ఒక జీవో జారీ చేసింది. అప్పట్లో కూడా స్థానికులు ఈ జీవోను వ్యతిరేకిస్తూ ఉద్యమం చేపట్టారు. గడువులోగా జిందాల్ కంపెనీ పెట్ట లేదు కాబట్టి, ఆ భూములను తిరిగి గిరిజనులకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఇంతలో ప్రభుత్వం మారిపోవడంతో..గత ప్రభుత్వ ప్రతిపాదనపై నేటి వరకు ఎలాంటి ఇష్యూ తెరపైకి రాలేదు. అయితే పది రోజుల కింద జిందాల్ భూముల్లో జేసీబీలతో చదను చేసే పనులు మొదలవ్వడంతో..ఒక్కసారిగా ఈ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. గిరిజనులు, స్థానికులు మళ్లీ రోడెక్కారు. స్థానిక వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గిరిజనులకు అండగా నిలిచారు.ఎమ్మెల్సీ రఘురాజుకు చెక్ పెట్టేందుకు ఎప్పుడూ ఎడమొహం పెడమొహంగా ఉండే ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, అదే నియోజకవర్గానికి చెందిన డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణలు ఒక్కటయ్యారు. ఇద్దరికి గిట్టకపోయినా అధిష్టానం ఒత్తిడితో కలవక తప్పలేదట. ఎమ్మెల్యే, డీసీఎంఎస్ ఛైర్మన్ ఇద్దరూ ఆందోళన చేస్తున్న గిరిజనుల దగ్గరకు వెళ్లి, సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, రెండు రోజులు గడువు కావాలని కోరారు.అయితే జిందాల్ భూ సమస్యపై వారికి ఎలాంటి అవగాహన ఉందో తెలియదు గాని, ఈ విషయంలో కాస్తంత అత్యుత్సాహం ప్రదర్శించారన్న విమర్శలు వస్తున్నాయి. ఎందుకంటే, జిందాల్ భూముల పరిహారానికి సంబంధించి 15 మంది నిర్వాసితులకు తప్ప మిగిలిన వారందరికీ అప్పట్లోనే ప్రభుత్వం పరిహారం చెల్లించిందని, ఇప్పుడు ఎలాంటి పరిహారం ఇవ్వాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. బిఆర్.అంబేద్కర్ ప్రకటించారు. అక్కడితో ఆగని ఎమ్మెల్యే, డీసీఎంఎస్ ఛైర్మన్..జిందాల్ భూముల్లో MSMEపార్కులు పెడతామని, పరిశ్రమల స్థాపనకు సహకరించాలని కూడా కోరి వివాదం మరింత ముదిరేలా చేశారు.MSME శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఈ వివాదంపై క్లారిటీ ఇవ్వడం మరో సంచలనానికి దారి తీసింది. జిందాల్ భూముల్లో MSME పార్క్ ఏర్పాటు పై ప్రభుత్వంలో ఎలాంటి చర్చ లేదని, అలాంటి ప్రతిపాదన కూడా లేదని క్లారిటీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను తెరపైకి తెచ్చి రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తున్నారని మండిపడితూ ఈ రాజకీయ గందరగోళానికి ఎండ్ కార్డ్ వేసే ప్రయత్నం చేశారు.అయితే ఎస్.కోట నియోజకవర్గంలో లీడర్ల మధ్య ఆధిపత్య పోరే..ఈ వివాదానికి దారితీసిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఓవైపు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, మరోవైపు డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మధ్యలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు..వీరికి కంటిలో నలుసులా మారారన్న చర్చ ఉంది.వాస్తవానికి ఎమ్మెల్సీ రఘురాజు వైసీపీలో ఉన్నా, భార్య సుధారాణి ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. ప్రసుతం ఎమ్మెల్సీ రఘురాజు అటు వైసీపీకి దూరంగా ఉండలేక, ఇటు టీడీపీకి దగ్గర కాలేకపోతున్నారు. ఈ ముగ్గురు నేతల మధ్య కొనసాగుతోన్న రాజకీయ పోరు కారణంగానే జిందాల్ భూముల వ్యవహారం రాజకీయ రంగు పులుముకుందన్న ప్రచారం జరుగుతుంది. అయితే మంత్రి కొండపల్లి ఇచ్చిన ప్రకటనతో..ఈ వివాదానికి తెర పడుతుందా..లేక నేతలు మరో రచ్చకు దారితీస్తారా అన్నది చూడాలి.





# భాషా ఉద్యమం తమిళనాడు దాటింది.. ఠాక్రేల కలయికపై స్టాలిన్..



ముంబై:జాతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగా, హిందీ భాష విధింపుపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వం విమర్శలు చేస్తున్నారు.ఇదిలా ఉంటే, మహారాష్ట్రలో ఈ వివాదమే 20 ఏళ్ల తర్వాత రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రేలు కలిసేందుకు సాయపడింది. బీజేపీ 'హిందీ'ని మరాఠీ ప్రజలపై విధిస్తోందని ఆరోపించారు. అయితే, ఈ విధానంపై వ్యతిరేకత రావడంతో దేవేంద్ర ఫడ్నవీస్ సర్కార్ తన ఉత్తర్వులను ఉపసంహరించుకున్న తర్వాత, ఠాక్రేలు ఇద్దరు కలిసి విజయోత్సవ సభ నిర్వహించారు.శనివారం 'వాయిస్ ఆఫ్ మరాఠీ' ర్యాలీని నిర్వహించారు. 2005 తర్వాత తొలిసారి ఇద్దరు నేతలు ఒకే వేదిక పైకి వచ్చారు. తాము ఇకపై కలిసే ఉంటామని చెప్పారు. తమ మధ్య దూరం తొలిగిందని ప్రకటించారు. ఈ కలయికను తమిళనాడు సీఎం స్టాలిన్ స్వాగతించారు. తమిళనాడులో ప్రస్తుతం ఉన్న ద్విభాషా-తమిళం, ఇంగ్లీష్ అమలులో ఉంది. అయితే, బీజేపీ ప్రభుత్వం హిందీని తమిళనాడుపై విధిస్తోందని స్టాలిన్ ఆరోపిస్తున్నారు.శనివారం ర్యాలీ తర్వాత ఎక్స్‌లో స్టాలిన్ కీలక పోస్ట్ పెట్టారు. భాషా హక్కుల కోసం పోరాటం రాష్ట్ర సరిహద్దులను దాటిందని, మహారాష్ట్రలో ఊపు కనిపిస్తోందని ఆయన అన్నారు. "హిందీ విధించడాన్ని ఓడించడానికి డీఎంకే, తమిళనాడు ప్రజలు తరతరాలుగా సాగుతున్న భాషా హక్కుల పోరాటం ఇప్పుడు రాష్ట్ర సరిహద్దులను దాటింది. మహారాష్ట్రలో నిరసన తుఫానులా ఎగిసిపడుతుంది" అని స్టాలిన్ అన్నారు."తమిళనాడు పాఠశాలల్లో హిందీని మూడవ భాషగా బోధిస్తేనే నిధులు కేటాయిస్తామని పేర్కొంటూ చట్టవిరుద్ధంగా మరియు అరాచకంగా వ్యవహరించే బిజెపి, వారు అధికారంలో ఉన్న మహారాష్ట్రలో ప్రజల తిరుగుబాటు భయంతో రెండవసారి వెనక్కి తగ్గవలసి వచ్చింది" అని స్టాలిన్ అన్నారు

# కాంగ్రెస్ గురించే కాదు.. కేసీఆర్.. చెప్పాల్సింది చాలా ఉంది!

హైదరాబాద్,త్వరలోనే ప్రెస్ మీట్ పెడతానని బీఆర్ ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చెప్పుకొచ్చారు. అంతేకాదు.. కాంగ్రెస్‌ను కడిగేస్తానని కూడా వ్యాఖ్యానించారు. తమపై చేస్తున్న దుష్ప్రచారం.. తమ నాయకులపై పెడుతున్న కేసుల వంటి అంశాలను ప్రస్తావిస్తానని ఆయన చెప్పారు. ఆసుపత్రిలో పార్టీ నాయకులతో భేటీ అయిన కేసీఆర్.. ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. మంచిదే.. కేసీఆర్ మీడియా ముందుకు రావాలనే అందరూ కోరుకుంటున్నారు.ఇంకా చెప్పాలంటే.. అసెంబ్లీకి కూడా కేసీఆర్ రావాలని కోరుకునేవారు చాలా మంది ఉన్నారు. రావడమే కాదు.. ప్రజల సమస్యలపై స్పందించాలని కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇక, ప్రెస్ మీట్‌లో తాను ఏం మాట్లాడాలని అనుకుంటున్నది చూచాయగా కేసీఆర్ చెప్పినట్టు తెలిసింది. ప్రధానంగా కాళేశ్వరంతో పాటు.. ఫోన్ ట్యాపింగ్, బనకచర్ల వ్యవహారాలను ఆయన ప్రస్తావించే అవకాశం ఉంది. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలోని లోపాలను కూడా ఆయన చెప్పే అవకాశం కనిపిస్తోంది.అయితే.. ఇక్కడితోనే కేసీఆర్ ప్రెస్‌మీట్‌కు పరిమితమైతే.. అది అసంపూర్ణమే అవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. నిజంగానే కేసీఆర్ మీడియా ముందుకు వస్తే.. ఆయన చెప్పాల్సిన విషయాలు చాలానే ఉన్నాయని అంటున్నారు. ప్రధానంగా తన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత రాసిన డియర్ డాడీ-లేఖ.. అనంత ర పరిణామాలపై ఆయన స్పందించాల్సి ఉంది. అలానే.. పార్టీలో నెంబర్ 2 ఎవరు? తన వారసత్వం ఎవరికి వస్తుందన్న విషయాన్ని కూడా క్లారిటీ ఇవ్వాల్సి ఉంటుంది.మరీ ముఖ్యంగా క్షేత్రస్థాయిలో తెలంగాణ జాగృతి తరఫున నిర్వహిస్తున్న కార్యక్రమాలు తనకుతెలిసే చేస్తున్నారో.. లేదో కూడా చెప్పాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే.. మరో ముఖ్య ఘట్టం.. బీజేపీతో దోస్తీ విషయంపై సొంత కుమార్తె చెప్పిన వ్యాఖ్యల్లో నిజానిజాలను కూడా కేసీఆర్ వెల్లడించక తప్పదు. బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు లేదా విలీనం చేసేందుకు చర్చలు జరిగాయని.. తాను జైల్లో ఉన్నప్పుడు.. ఈ ప్రతిపాదన వచ్చిందని కవిత చెప్పిన విషయం తెలిసిందే.ఇప్పుడు కేసీఆర్ నిజంగానే మీడియా ముందుకు వస్తే.. ఈ విషయాన్ని తేల్చాల్సి ఉంటుంది. అలా కాకుండా.. కేవలం కాంగ్రెస్‌ను టార్గెట్ చేసుకుని.. సొంత విషయాలను విస్మరిస్తే.. అది ఆయనకే కాదు.. ఆయన రాజకీయాలకు శోభనివ్వదన్న వాదన బలంగా వినిపిస్తోంది.



# ఎట్టకేలకు బాహ్యప్రపంచంలోకి ఇరాన్ సుప్రీం లీడర్



టెహ్రాన్: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఎట్టకేలకు బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. రాజధాని టెహ్రాన్‌లో జరిగి ఒక మతపరమైన కార్యక్రమంలో పాల్గొన్నారు. షియా ముస్లిం క్యాలెండర్‌లో అతి ముఖ్యమైన రోజు అయిన అషురా(మొహర్రం)ను జరుపుకుంటున్న హాలులోకి ఖమేనీ ప్రవేశించారు. దీనికి సంబంధించిన వీడియోలను ఇరాన్ స్టేట్ టీవీ ప్రసారం చేసింది. సాంప్రదాయ నల్లని వస్త్రాలు ధరించిన ఆయన ప్రజల హర్షధ్వానాల మధ్య, అందరినీ పలకరిస్తూ అందులో కనిపించారు. ప్రతి ఏడాది ఖమేనీ ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొంటారు. కాగా, ఇరాన్-ఇజ్రాయెల్ ముగిసిన తర్వాత ఆయన బహిరంగంగా కనిపించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆయనను చూసి జనాలు పెద్దపెట్టున నినాదాలు చేశారు.ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య 12 రోజులపాటు సాగిన యుద్ధం జూన్ 24న ముగిసింది. ఇదరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం కుర్చుకోవడంతో యుద్ధానికి తెరపడింది. అయితే ఖమేనీ మాత్రం ఇప్పటి వరకూ బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం కావడంతో ఖమేనీ సురక్షితమైన బంకర్‌లోకి వెళ్లినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తన ఫ్యామిలీతో కలిసి అత్యంత సురక్షితమైన బంకర్‌లో ఖమేనీ తలదాచుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అయితే, కాల్పుల విరమణ అమల్లోకి వచ్చి.. యుద్ధం ముగిసినప్పటికీ ఆయన బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడం పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో 'ఖమేనీ ఎక్కడ..?' అంటూ ఇరాన్ ప్రజలు, నేతల్లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో దేశ ప్రజలకు సందేశం ఇచ్చారు.

## అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా పరీక్షలు వాయిదా

హైదరాబాద్,ఉస్మానియా యూనివర్సిటీ- పరిధిలోని అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ బయో ఇన్ఫర్మేటిక్స్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల ఏడవ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు-గతంలో ప్రకటించినప్పటికీ, వివిధ కారణాల రీత్యా ఈ పరీక్షలను వాయిదా వేసినట్లు- చెప్పారు.

# ప్రజల స్వేచ్ఛ కోసం..అమెరికాలో మస్క్ కొత్త రాజకీయ పార్టీ



వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో మరో కొత్త పార్టీ అవతరించింది. రిపబ్లికన్, డెమొక్రాట్లకు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. అపర కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ నూతన రాజకీయ పార్టీని ఏర్పాటుచేశారు. ట్రంప్ కలల బిల్లు అయిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'ను ఆమోదించిన మరుక్షణమే తాను రాజకీయ పార్టీని ఏర్పాట్లు చేస్తానని మస్క్ ప్రకటించిన విషయం తెలిసిందే. బిగ్ బ్యూటీఫుల్ బిల్లును అమెరికా ఉభయ సభలు ఆమోదించడం, ట్రంప్ ఆ బిల్లుపై సంతకం చేయడం, అది చట్టం రూపం దాల్చడం జరిగిపోయాయి. దీంతో 'ది అమెరికా పార్టీ' ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.అమెరికాలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం లేదని, ప్రజలకు స్వేచ్ఛ ఇచ్చేందుకే పార్టీ ఏర్పాటు చేశానని ఎలాన్ మస్క్ అన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'మీరు కొత్త రాజకీయ పార్టీని కోరుకుంటున్నారు. అది మీకు లభిస్తుంది. ఈ రోజు మీకు మీ స్వేచ్ఛను తిరిగి ఇవ్వడానికి అమెరికా పార్టీ ఏర్పడింది' అని పోస్ట్ చేశారు. సోషల్ మీడియాలో వచ్చిన సూచనలకు సానుకూలంగా స్పందించిన మస్క్, ఎక్స్ వినియోగదారుల నుంచి సంపూర్ణ మద్దతు లభించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ట్రంప్-మస్క్ మధ్య విభేదాలు..

ట్రంప్ కలల బిల్లుగా చెప్పుకున్న వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఈ బిల్లును మస్క్ మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. దీంతో ఈ బిల్లు కారణంగా మిత్రులు కాస్తా శత్రువులయ్యారు. ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. ఓ సందర్భంలో సామాజిక సంక్షేమ కార్యక్రమాలను తగ్గించి, అమెరికన్ల రుణాన్ని పెంచే ప్రజాదరణ లేని ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే చట్ట సభ సభ్యులను పదవీచ్యుతులను చేస్తానంటూ మస్క్ వ్యాఖ్యానించారు.ఈ బిల్లుకు ఆమోదం లభిస్తే మరుసటి రోజే తాను కొత్త పార్టీ పెడతానంటూ హెచ్చరించారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**